మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
EEVARTHALU దినపత్రిక

PRGI REGD NO: TGTEL/25/A1385

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 25-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 237 Issue: 237

25 ఫిబ్రవరి 2026 - బుధవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:40 సూర్యాస్తమయం - సా. 6:17 తిథి నవమి రా. 2:41ం వరకు తరువాత దశమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం రోహిణి మ. 1:37 వరకు తరువాత మృగశిర యోగం విష్కంభ రా. 1:28ం వరకు కరణం భాలవ మ. 3:46 వరకు కౌలవ రా. 2:41ం వరకు వర్జ్యం ఉ. 6:08 నుండి ఉ. 7:38 వరకు దుర్మuహూర్తం మ. 12:05 నుండి మ. 12:52 వరకు రాహుకాలం మ. 12:29 నుండి మ. 1:56 వరకు యమగండం ఉ. 8:07 నుండి ఉ. 9:35 వరకు గుళికాకాలం ఉ. 11:02 నుండి మ. 12:29 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:04 నుండి తె. 5:52 వరకు అమృత ఘడియలు ఉ. 10:37 నుండి మ. 12:07 వరకు అభిజిత్ ముహూర్తం లేదు

Published from Jagitial
www.evarthalu.com





# రాజకీయాల్లోకి వస్తా

## మావోయిస్టు అగ్రనేత దేవ్ జీ డీజీపీ ఎదుట లొంగుబాటు

### ఇద్దరికి 25లక్షలు, మరో ఇద్దరికి 20లక్షల చొప్పున పరిహారం

అనారోగ్య కారణాల రీత్యా తాను రహస్య జీవితాన్ని వదిలి బహిరంగ జీవితంలోకి రావాలని నిర్ణయం తీసుకున్నట్లు మావోయిస్టు అగ్రనేత దేవ్ జీ తెలిపారు. ఇక, రాజకీయ జీవితంలోకి వస్తానని.. వ్యక్తిగత జీవితం కోసం కాదని, ప్రజల సమస్యలపై చట్టబద్ధమైన పద్ధతుల్లో (లీగల్ ఫ్రేమ్‌వర్క్‌లో) పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు.



హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఈవార్తలు): 'దశాబ్దాల తరబడి నేను నమ్మిన సిద్ధాంతం గైడెన్స్‌గా ఇకపై రాజకీయ జీవితాన్ని కొనసాగించాలనుకుంటున్నాను' అని అన్నారు. దేవ్ జీ, రాజిరెడ్డితో సహా పలువురు కీలక నేతలు మంగళవారం డీజీపీ ఎదుట లొంగిపోయారు. ఈ లొంగుబాటుతో మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పూర్తిగా నిర్మూలించబడినట్లేనని పోలీసులు ప్రకటించారు. అనంతరం దేవ్ జీ విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన నేరుగా సమాధానం ఇవ్వలేదు. తొందరపడి మాట్లాడితే అపార్థాలకు, అనవసరపు చర్చలకు దారితీస్తుందని, తన భవిష్యత్ రాజకీయ జీవితానికి ఇబ్బంది తరువాయి 2 వ పేజీలో...

# బాలికలందరికీ.. గార్డాసిల్ టీకా ఫ్రీ

## 'కేరళం'గా కేరళ రాష్ట్రం పేరు

### మూడో ఆర్థిక వ్యవస్థకు 'సేవా సంకల్ప్'.. 12,236 కోట్లతో పలు ప్రాజెక్టులు

### కీలక నిర్ణయాలు తీసుకున్న కేంద్రం.. సేవా తీర్థ్‌లో తొలి కేబినెట్ భేటీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం మంగళవారం పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. నూతనంగా ప్రారంభమైన 'సేవా తీర్థ్' సముదాయంలో జరిగిన ఈ తొలి సమావేశంలో, దేశవ్యాప్తంగా బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా అందించడం, కేరళ పేరును 'కేరళం'గా మార్చడం సహా అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది.



# హైదరాబాద్‌లో అకాల వర్షం

- ఆరెంజ్ అలర్ట్.. పలుచోట్ల కురిసిన వర్షం
- మియాపూర్, చందానగర్‌లో ట్రాఫిక్
- అల్పపీడనంతో మరో 2 రోజులు వానలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఈవార్త లు): హైదరాబాద్ నగరంలో మంగళ వారం అకాల వర్షం ముంచెత్తింది. గ త రెండు రోజులుగా ఉక్కపోతతో అల్లా డిన నగరవాసులకు ఈ వర్షం ఉపశ మనం కలిగించినప్పటికీ, పలుచోట్ల జనజీవనానికి అంతరాయం -2 వ పేజీలో...



# ఇంటర్ పరీక్షలు నేటి నుంచే

### 5 నిమిషాలు లేటైనా పర్లేదు

రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నేటి నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో, బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు తమ హాల్ టికెట్లను చూపి నేరుగా పరీక్షా కేంద్రాల్లోకి ప్రవేశించవచ్చని, వాటిపై ప్రిన్సిపల్ సంతకం ఉండాలనే నిబంధన లేదని స్పష్టం చేసింది.

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్): | రూ.16,178 |
| వెండి (గ్రాము): | రూ.290 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,229 |

# రేవంత్‌కు చిప్పకూడే!

## మీ అరాచకాలకు శిక్ష పడుతుంది.. రెండేళ్లలో కేసీఆరే ముఖ్యమంత్రి

## డీజీపీ.. ఖాకీ బుక్ ఎక్కడుంది?.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

'రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది కాబట్టి వాళ్లకు ఒక నీతి, ప్రతిపక్షంలో ఉన్నాం కాబట్టి మాకు ఒక నీతిఅనే విషయాన్ని డీజీపీ తెలియజేయాలి. డీజీపీ గానీ, రేవంత్ రెడ్డి గానీ అధికారం ఎవడికీ శాశ్వతం కాదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. రానున్న రెండు సంవత్సరాల్లో కేసీఆర్ సీఎం అవుతారు, రాష్ట్రంలో గులాబీ జెండా ఎగురుతుంది. కచ్చితంగా మీ అరాచకాలకు అప్పుడు తగిన శిక్షను అనుభవిస్తారు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఈవార్తలు): 'ఒక్కటి మాత్రం గుర్తు పెట్టుకో రేవంత్ రెడ్డి, మళ్ళీ నువ్వు చిప్పకూడు తినే టైం వస్తుంది. తప్పకుండా ఆ రోజు నువ్వు తగిన శిక్షను అనుభవిస్తావు'అంటూ శాపనార్థాలు పెట్టారు. ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్నమాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తోపాటు ఇతర పార్టీ నేతలను ములాఖత్ ద్వారా కేటీఆర్ పరామర్శించారు. అనంతరం జైలు బయట కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.'రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల్లో ఎన్ని అరాచకాలు చేసినా కాంగ్రెస్ పార్టీకి,బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పారు. మా పార్టీ అభ్యర్థులను బెదిరించడం, భయపెట్టడం, దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ చేసింది. ఇదే కాకుండా ప్రజలు ఇచ్చిన తీర్పును అపహాస్యం చేసే విధంగా అనేక మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన అరాచకాలను, తరువాయి 2 వ పేజీలో...



# శశికళ కొత్త పార్టీ

### జెండాతో సడెన్ సర్‌ప్రైజ్

### తమిళనాడులో సంచలనం



తమిళనాడులో ఎన్నికల వేళ మరో కొత్త పార్టీ పురుడు పోసుకుంది. త్వరలోనే కొత్త పార్టీ పెట్టబో తున్నానని శశికళ ప్రకటించింది. ఈ సందర్భంగా తమిళనాడులో జరిగిన సభలో పార్టీ జెండా ఆవిష్కరించింది. తెలుపు, నలుపు, ఎరుపు రంగులతో పార్టీ జెండాను రూపొందించారు.

చెన్నై: దివంగత నేతలు జయలలిత, అన్నాదురై, ఎంజీఆర్ గుర్తులతో జెండా ఉంది. అయితే పార్టీ పేరు మాత్రం త్వరలోనే ప్రకటిస్తానని శశికళ తెలిపింది. తమిళనాడులో త్వరలో జరిగే ఎన్నికల్లో తన సత్తా ఏంటో చూపిస్తానంది. అయితే మంగళవారం దివంగత ముఖ్యమంత్రి జయలలిత జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న శశికళ.. త్వరలోనే ఒక శుభవార్త వింటారని బహిరంగంగా ప్రకటించారు. దీంతో రేపోమాపో తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



ద్రవరూప ఉప్పుతో తయారుచేసిన బ్యాటరీని డెన్మార్క్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ బ్యాటరీతో దాదాపు లక్ష ఇళ్లకు, 10 గంటల పాటు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయవచ్చు. విద్యుత్తును అత్యధిక కాలం పాటు నిల్వ చేసుకొనే సామర్థ్యం కలది.




# బస్సు టికెట్ కోసం 'మీసేవ'

### మీ సేవ ద్వారా 'మీ టికెట్'.. టీజీఎస్ఆర్టీసీ ప్రయాణికులకు గుడ్‌న్యూస్

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఈవార్తలు): తెలంగాణలో ప్రయాణకుల కోసం టీజీఎస్ఆర్టీసీ గుడ్‌న్యూస్ తెలిపింది. టీజీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సౌలభ్యం కోసం 'మీ టికెట్ మొబైల్'యాప్ ద్వారా సేవల్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌ను మంగళవారం సచివాలయంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ స్పెషల్ సెక్రటరీ వికాస్ రాజ్, తెలంగాణ ఆర్టీసీ ఎండీ వై నాగిరెడ్డి, తరువాయి 2 వ పేజీలో...

# 'భోజ్‌శాల' మసీదులో ఆలయ ఆనవాళ్లు

### వెల్లడించిన భారతీయ పురావస్తు శాఖ



న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లోని వివాదాస్పద భోజ్‌శాల వివాదం కొత్త మలుపు తిరిగింది. భోజ్‌శాలలో కమల్ మౌలా మసీదు ఉన్న ప్రాంతంలో ప్రాచీన ఆలయాల ఆనవాళ్లను గుర్తించినట్టు భారతీయ పురావస్తు శాఖ(ఏఎస్ఐ) తెలిపింది. వివాదాస్పద భోజ్‌శాల కాంప్లెక్స్‌ను హిందువులు వాగ్దేవి (సరస్వతి) ఆలయంగా, ముస్లింలు కమల్ మౌలా మసీదుగా భావిస్తున్నారు. అయితే, ప్రాచీన ఆలయాల శిథిలాలతోనే మసీదు నిర్మాణం జరిగిందనేందుకు ఆధారాలు లభించాయని పురావస్తు శాఖ తాజాగా తెలిపింది. తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

25.2.2026

మేషం: నూతన వస్తు వాహన లాభాలు పొందుతారు. పాత మిత్రులతో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆప్తుల నుండి విలువైన విషయాలు సేకరిస్తారు. గృహ వాతావరణం ఆనందంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలు అనుకూలిస్తాయి. ఉద్యోగాలలో సమస్యలు తొలగి ఊరట పొందుతారు.

వృషభం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఉద్యోగాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. ముఖ్యమైన వ్యవహారాల్లో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం వలన నష్టాలు తప్పవు. చేపట్టిన పనులు మరింత మందకొడిగా సాగుతాయి. దూర ప్రయాణాలు వలన వృథా ఖర్చులు పెరుగుతాయి.

మిధునం: కుటుంబ విషయాలలో మాట పట్టింపులు తొలగుతాయి. రావలసిన సొమ్ము సకాలంలో చేతికి అందుతుంది. ముఖ్యమైన వ్యవహారాలు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. నూతన వాహన యోగం ఉన్నది. వృత్తి వ్యాపారాలలో అంచనాలకు మించి లాభాలు అందుకుంటారు. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

కర్కాటకం: ఆర్థిక పరమైన ఒడిదుడుకుల నుండి బయటపడతారు. చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. సమాజంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో విందువినోదాది కార్యక్రమాల్లో పాల్గొంటారు. నిరుద్యోగులకు సదావకాశాలు లభిస్తాయి. ఉద్యోగస్తులకు అధికారుల అనుగ్రహం కలుగుతుంది.

సింహం: దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వలన మానసిక ప్రశాంతత కలుగుతుంది. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. నూతన ఋణ ప్రయత్నాలు అంతగా కలిసిరావు. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగులకు స్థానచలన సూచనలున్నవి.

కన్య: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. సోదర సంబంధిత విషయమై మాటపట్టింపులు ఉంటాయి. ఇంటాబయట ఋణపరమైన ఒత్తిడి పెరుగుతుంది. చేపట్టిన పనులలో స్వల్ప అవరోధాలుంటాయి. వృత్తి వ్యాపారాలలో భాగస్వాములతో వివాదాలకు వెళ్లకపోవడం మంచిది. నిరుద్యోగ ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి. ఉద్యోగస్తులకు పని ఒత్తిడి పెరుగుతుంది.

తుల: నిరుద్యోగులకు ఉన్నత అవకాశాలు లభిస్తాయి. నూతన వాహన కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో సఖ్యత పెరుగుతుంది. కొన్ని వ్యవహారాలను జీవిత భాగస్వామి సహాయ సహకారాలు తీసుకోవడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో ఆశించిన పురోగతి లభిస్తుంది.

వృశ్చికం: సమాజంలో ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. ఆర్థికంగా మెరుగైన వాతావరణం ఉంటుంది. అవసరానికి బంధుమిత్రుల నుండి సహాయ సహకారాలు అందుతాయి. వృత్తి వ్యాపారాలలో స్వంత నిర్ణయాలు కలసివస్తాయి. ఉద్యోగాలలో మీ సమర్థతకు అధికారుల నుంచి గుర్తింపు లభిస్తుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

ధనస్సు: ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. వృత్తి వ్యాపారాల్లో నూతన సమస్యలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో అకారణంగా మాట పడవలసి వస్తుంది. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతల వలన విశ్రాంతి లభించదు. మిత్రులతో మాటపట్టింపులుంటాయి. వాహన ప్రయాణ విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి.

మకరం: చేపట్టిన పనుల్లో వ్యయ ప్రయాసలు అధికం అవుతాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. దూరపు బంధువుల నుండి ఊహించని మాటలు వినవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగ విషయమై అధికారులతో చర్చలకు వెళ్లకపోవడం మంచిది. నిరుద్యోగ ప్రయత్నాలు నిదానంగా సాగుతాయి.

కుంభం: ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ముఖ్యమైన పనులు అప్రయత్నంగా పూర్తి చేస్తారు. గృహ నిర్మాణ పనులు వేగవంతం చేస్తారు. వ్యాపారాల్లో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలు ఉన్నపటికీ నిదానంగా పూర్తిచేస్తారు.

మీనం: అవసరానికి చేతిలో డబ్బు నిలువ ఉండదు. వృత్తి వ్యాపారాలలో అధిక శ్రమకు అల్ప ఫలితం పొందుతారు. కుటుంబ సభ్యుల మాటలు మానసికంగా భాధ కలిగిస్తాయి. ఉద్యోగ వాతావరణం చికాకుగా ఉంటుంది. నిరుద్యోగ యత్నాలు కొంత మందకొడిగా సాగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

# బాలికలందరికీ గార్డాసిల్ టీకా ఫ్రీ

**'కేరళం'గా కేరళ రాష్ట్రం పేరు**
**మూడో ఆర్థిక వ్యవస్థకు 'సేవా సంకల్ప్'..**
**12,236 కోట్లతో పలు ప్రాజెక్టులు**
**కీలక నిర్ణయాలు తీసుకున్న కేంద్రం..**
**సేవా తీర్థ్‌లో తొలి కేబినెట్ భేటీ**

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం మంగళవారం పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. నూతనంగా ప్రారంభమైన 'సేవా తీర్థ్' సముదాయంలో జరిగిన ఈ తొలి సమావేశంలో, దేశవ్యాప్తంగా బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా అందించడం, కేరళ పేరును 'కేరళం'గా మార్చడం సహా అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. రాబోయే రోజుల్లో భారత్‌ను ప్రపంచంలోని మూడు అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలబెట్టడమే లక్ష్యంగా 'సేవా సంకల్ప్' పేరిట ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించింది. మంగళవారం 'సేవా తీర్థ్' ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశం దేశ ప్రగతి ప్రయాణంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది అని కేబినెట్ అభివర్ణించింది. వలసవాద గతం నుంచి ఆత్మవిశ్వాసంతో కూడిన నవ భారతం వైపు సాగుతున్న ప్రయాణానికి ఈ నూతన పరిపాలనా కేంద్రం ఒక శక్తివంతమైన చిహ్నమని తీర్మానంలో పేర్కొన్నారు. 'సేవా తీర్థ్' అనే పేరు సేవ, బాధ్యత, అంకితభావాలకు ప్రతిరూపమని, ఇక్కడ పరిపాలనను ఒక పవిత్ర యాత్రగా భావిస్తామని వివరించారు. ఈ సమావేశంపై ప్రధాని మోదీ ట్వీట్ చేస్తూ.. "స్వదేశీ ఆలోచన, ఆధునిక దృక్పథం, 140 కోట్ల ప్రజల అపార సామర్థ్యంతో భారతదేశాన్ని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు సంకల్పం చేశాం" అని తెలిపారు. ఈ సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాల్లో భాగంగా, బాలికల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ దేశవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధక (హెచ్‌పీవీ) 'గార్డాసిల్' టీకాను అందించే కార్యక్రమానికి పచ్చజెండా ఊపారు. అదేవిధంగా, కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చే ప్రతిపాదనను కూడా కేబినెట్ ఆమోదించింది. మౌలిక సదుపాయాల కల్పనకు ఊతమిస్తూ సుమారు రూ.12,236 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో అహ్మదాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు, జబల్‌పూర్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులు ఉన్నాయి. వీటితో పాటు దేశవ్యాప్తంగా విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసే సంస్కరణలకు కూడా ఆమోదం లభించింది. ప్రభుత్వ పరిపాలన అధికార కేంద్రంగా కాకుండా, ప్రజల సాధికారతకు కేంద్రంగా పనిచేయాలని 'సేవా సంకల్ప్' తీర్మానంలో స్పష్టం చేశారు. 'నాగరిక దేవో భవ' (పౌరుడే దైవం) అనే సూత్రాన్ని పాటిస్తూ, ప్రతి నిర్ణయం 140 కోట్ల ప్రజల సేవకే అంకితమవుతుందని పేర్కొన్నారు. గత దశాబ్దంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు



తీసుకురావడాన్ని గుర్తుచేస్తూ.. 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' వేగంతో భారత్‌ను త్వరలోనే ప్రపంచంలోని టాప్-3 ఆర్థిక శక్తిగా నిలబెట్టేందుకు దృఢ సంకల్పం తీసుకున్నట్లు తెలిపారు. మొత్తం మీద, ఈ సమావేశం 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించే దిశగా ఒక బలమైన పునాది వేసిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# శశికళ కొత్త పార్టీ

మొదటి పేజీ తరువాయి

శశికళ తన రాజకీయ భవిష్యత్తుపై క్లారిటీ ఇస్తూ, కొత్త పార్టీని ప్రకటించే అవకాశం ఉందనే ఊహాగానాలు సర్వత్రా వినిపించాయి. ఇంతలోనే పార్టీ పెడుతున్నట్లు ప్రకటించారు. కాగా శశికళ, జయలలితకు అత్యంత సన్నిహితురాలు ఆమె మరణానంతరం ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శిక్ష అనుభవించి, తదనంతరం ఏఐఏడీఎంకే నుంచి బహిష్కరణకు గురైన శశికళ, గత కొంతకాలంటా చెన్నై వేదికగా తన మద్దతుదారులతో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. పార్టీ నుంచి బహిష్కృతురాలైనప్పటికీ, రాజకీయాల్లో మళ్లీ క్రియాశీలక పాత్ర పోషించాలనే పట్టుదలతో ఆమె ఉన్నారనే మాట వినిపిస్తోంది. ఈ క్రమంలోనే ఆమె అనుచరులు సైతం 'చిన్నమ్మ' తీసుకునే ఏ నిర్ణయానికైనా తాము కట్టుబడి ఉంటామని బహిరంగంగా ప్రకటిస్తున్నారు. దీంతో తమిళనాట పొలిటికల్ హీట్ మరింత ముదిరింది. తమిళనాడులో ఇదివరకే ఫిలిం స్టార్ విజయ్ పొలిటికల్ పార్టీ పెట్టి జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇప్పుడు శశికళ ఎంట్రీతో ఆ రాష్ట్రంలో పొలిటికల్ హీట్ మరింత పెరిగింది. కాగా ఈ ఏడాది తమిళనాడులో ఎన్నికలు జరగనున్నాయి.

# రాజకీయాల్లోకి వస్తా

మొదటి పేజీ తరువాయి

కలగకూడదనే ఉద్దేశంతోనే ప్రస్తుతం అన్నివిషయాలుపంచుకోలేకపోతున్నానని వివరించారు. త్వరలోనే ఇంటర్వ్యూలరూపంలో అన్ని ప్రశ్నలకు వివరంగా సమాధానమిస్తానని హామీ ఇచ్చారు. ఈ పరిణామం తెలంగాణలో మావోయిస్టు ఉద్యమ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### దేవ్‌జీ, రాజిరెడ్డికి రూ.25 లక్షలు

లొంగిపోయిన నేతలు దశాబ్దాలుగా అజ్ఞాతంలో కొనసాగుతూ పార్టీలో అత్యున్నత స్థాయి బాధ్యతలు నిర్వర్తించారు. 40 ఏళ్లకు పైగా అజ్ఞాతంలో ఉన్న దేవ్ జీ, 46 ఏళ్లకు పైగా అజ్ఞాతంలో ఉన్న మల్లా రాజిరెడ్డి వంటి సీనియర్లు జనజీవన ప్రవంతిలోకి రావడం ఉద్యమాన్ని తీవ్రంగా బలహీనపరిచిందని డీజీపీ శివధర్ రెడ్డి మీడియా సమావేశంలో తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకంలో భాగంగా దేవ్ జీ, మల్లా రాజిరెడ్డిలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షలు, బడే చొక్కారావు, నూనె నరసింహారెడ్డిలకు ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున రివార్డు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఇంకా 11 మంది తెలంగాణకు చెందిన మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారని, వారు కూడా లొంగిపోవాలని పిలుపునిచ్చారు. మావోయిస్టు అగ్రనేత ముప్పాళ్ల లక్ష్మణ్ రావు (గణపతి) అడవుల్లో లేరని, బయట ఎక్కడో ఆశ్రయం పొందుతున్నారని డీజీపీ పేర్కొన్నారు.

# 'భోజ్‌శాల' మసీదులో ఆలయ ఆనవాళ్లు

మొదటి పేజీ తరువాయి

ముస్లిం వర్గాలు వాదిస్తున్నట్టు మసీదు 11వ శతాబ్దం నాటికి లేదని, ఆ తర్వాత నిర్మాణమైందని పేర్కొంది. ఈ మేరకు 'ఏ[illegible]సఐ' అధికారులు సమర్పించిన నివేదికను మధ్యప్రదేశ్ హైకోర్టు సోమవారం పరిశీలించింది. ఇరుపక్షాలూ రెండు వారాల్లో ఈ నివేదికపై అభ్యంతరాలు తెలియజేయాలని కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 16వ తేదీకి వాయిదా వేసింది.

# అకాల వర్షం

మొదటి పేజీ తరువాయి

కలిగించింది. ముఖ్యంగా మియాపూర్, చందానగర్, కోండాపూర్, మదీనాగూడ, లింగంపల్లి వంటి ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. గంగారం నుంచి మియాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై వర్షపు నీరు చేరడంతో వాహనాలు నిలిచిపోయి తీవ్రమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు, నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణలో వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న రెండు రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని, గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద, పాత భవనాల వద్ద నిలబడవద్దని సూచించింది. ఈ అకాల వర్షాలు రైతులపై మిశ్రమ ప్రభావం చూపుతున్నాయి. కొన్ని ఆరుతడి పంటలకు ఈ వానలు మేలు చేస్తుండగా, ఈదురుగాలులు, వడగళ్ల కారణంగా చేతికొచ్చిన వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు వాతావరణ శాఖ యెల్లో అలర్ట్ జారీ చేసింది.

# ఇంటర్ పరీక్షలు నేటి నుంచే

### 5 నిమిషాలు లేటైనా పర్లేదు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఈవార్తలు): రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నేటి నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో, బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు తమ హాల్ టికెట్లను చూపి నేరుగా పరీక్షా కేంద్రాల్లోకి ప్రవేశించవచ్చని, వాటిపై ప్రిన్సిపల్ సంతకం ఉండాలనే నిబంధన లేదని స్పష్టం చేసింది. నేటి నుండి మార్చి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా పరీక్షలు జరగనున్నాయి. పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు ఎలాంటి ఆంక్షలు ఉండవు. కేవలం హాల్ టికెట్ చూపిస్తే సరిపోతుందని పేర్కొంది. గతంలో హాల్ టికెట్లపై సంతకాల కోసం విద్యార్థులు కళాశాలల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కొన్ని యాజమాన్యాలు ఫీజుల బకాయిల సాకుతో హాల్ టికెట్లను నిలిపివేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో, విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా రవాణా, స్థానిక యంత్రాంగం సహకరించాలని బోర్డు కోరింది. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండటానికి విద్యార్థులు ఇంటి



నుండి త్వరగా బయలుదేరాలని, తప్పనిసరిగా హాల్ టికెట్ వెంట తెచ్చుకోవాలని బోర్డు కార్యదర్శి సూచించారు.

# బస్సు టికెట్ కోసం 'మీసేవ'

మొదటి పేజీ తరువాయి

మీ సేవ కమిషనర్ రవికిరణ్‌తో కలిసి మట్నబైల్ యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సరికొత్త విధానం ద్వారా మీ టికెట్ మొబైల్ యాప్ ఓపీఆర్ఎస్ సేవలను కూడా అనుసంధానిస్తుంది. ప్రయాణికులు సుదూర ప్రయాణాలు, ఇంటర్‌సిటీ బస్సు టిక్కెట్లను డిజిటల్‌గా బుక్ చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది.

యాప్ ద్వారా అందించే సేవలు:
మొత్తం ఓపీఆర్ఎస్ సేవలు: 1,710
ఏసీ సేవలు: 450
నాన్-ఏ/సీ సేవలు: 1,260
రోజువారీగా బుకింగ్ అయ్యే సీట్లు 13,000

# రేవంత్‌కు చిప్పకూడే!

మొదటి పేజీ తరువాయి

దుర్మార్గాలను మొత్తం రాష్ట్రం గమనించింది'అని కేటీఆర్ చెప్పుకొచ్చారు. 'మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి 10 స్థానాలు, మాతో పొత్తులో ఉన్న సీపీఐ పార్టీకి 4 స్థానాలు వచ్చాయి. అంటే మట్నత్తం 14 స్థానాల్లో గెలుపొందాం.కాంగ్రెస్ కేవలం 7 స్థానాల్లోనే గెలుపొందింది.అత్యధిక స్థానాల్లో తాము గెలుపొందినా మున్సిపల్ చైర్మన్ పదవిని చేజిక్కకుండా కాంగ్రెస్ పార్టీ అరాచకాలు చేసింది' అని ఆరోపించారు. కేవలం ఏడు స్థానాలు గెలిచి అప్రజాస్వామికంగా ఆ మున్సిపాలిటీని దక్కించుకునే అధికార దాహం, కక్కుర్తి కాంగ్రెస్ పార్టీ చూపించింది అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు స్థానిక మంత్రి వివేక్ దురాగతాలు, అధికార యంత్రాంగం పూర్తిగా అరాచకంగా ప్రవర్తించి ప్రజలు ఇచ్చిన తీర్పును అపహాస్యం చేశారు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం వంటి చోట్ల కూడా ఇదే రకమైన అరాచకాన్ని కాంగ్రెస్ పార్టీ చేసింది. అయితే క్యాతన్‌పల్లిలో ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా మా 14 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీకి లొంగకుండా నిలబడితే, మా పార్టీ మహిళా కౌన్సిలర్ల మీద కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అసభ్యంగా ప్రవర్తించి దాడికి దిగినా అక్కడ ఉన్న మంత్రి గానీ, ఎంపీ గానీ నవ్వుకుంటూ చూశారు కానీ నిలువరించే ప్రయత్నం చేయలేదు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇంత దిగజారుడు రాజకీయం బహుశా దేశ చరిత్రలో ఎక్కడ కూడా జరిగి ఉండదు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు జనగామలో కూడా దళిత మహిళా కౌన్సిలర్‌ను చేయి పట్టి బలవంతంగా గుంజి చిల్లరగా ప్రవర్తించారు. అయితే క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ అరాచకాలను అధికారుల అక్రమాలను ప్రశ్నిస్తే మా మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో పాటు మూల రాజిరెడ్డిని, ఇంకొంతమంది పార్టీ నేతలను అరెస్ట్ చేసి ఆదిలాబాద్ జిల్లా జైలుకు తరలించారు అని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అరాచకాలను అడ్డుకున్నందుకే మా పార్టీ నాయకుల పైన అక్రమ కేసులు పెట్టిన ఈ ప్రభుత్వం మరి సొంత పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కానీ, బీజేపీ ఎంపీ అరవింద్ కానీ పోలీసులను అడ్డగోలుగా బూతులు తిట్టిన, బట్టలు ఊడదీసి కొడతా అన్న, ఇడియట్ అంటూ.. యూజ్ లెస్ ఫెలో.. అంటూ మాట్లాడిన ఎలాంటి కేసులు లేవు'అని కేటీఆర్ ప్రశ్నించారు. 'రాష్ట్ర డీజీపీ ఒక పార్టీకి ఒక న్యాయం, కాంగ్రెస్ - బీజేపీకి ఇంకో న్యాయం అన్నట్లు వ్యవహరిస్తున్నాడు. కాంగ్రెస్ పార్టీ, బీజేపీ పార్టీ నాయకుల అరాచకాలు డీజీపీకి కనిపించడం లేదా?' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మరోవైపు క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో ఒక్కొక్కరికి మూడు కోట్ల రూపాయల డబ్బులు ఆశ చూపినా నిజాయితీ కలిగిన బిడ్డలుగా కౌన్సిలర్లు లొంగలేదు. మీ పైసలు వద్దు, ఖచ్చితంగా మా నాయకుడు కేసీఆర్ వెంట ఉంటాం, మా సోదరుడు సుమన్ వెంట ఉంటామంటూ అండగా నిలబడ్డారు. ఇంత బలంగా నిలబడిన మా పార్టీ కౌన్సిలర్లకు, పొత్తు ధర్మానికి అనుగుణంగా నిలబడిన సీపీఐ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. 'మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ని జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్న వాళ్ళకి ఒక్కటే చెబుతున్నా. సుమన్‌కి ఇవాళ జైలుకు పోవడం కొత్త కాదు, ఉద్యమ కాలంలో అనేకసార్లు జైలుకు పోయిండు, ఆరు నెలలకు పైగా వివిధ సందర్భాల్లో జైల్లో ఉన్నాడు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు.'పోలీసుల అరాచకాలు, పోలీస్ స్టేషన్లు అయితే లెక్కలో లేనంత గొప్పగా పోరాటం చేసిండు. అలాంటిది రేవంత్ రెడ్డి ఈ అక్రమ కేసుతో మా నాయకుడిని భయపెట్టిస్తామంటే ఎవరూ భయపడరు. ఒక్కటి మాత్రం గుర్తు పెట్టుకో రేవంత్ రెడ్డి, మళ్ళీ నువ్వు చిప్పకూడు తినే టైం వస్తుంది. తప్పకుండా ఆ రోజు నువ్వు తగిన శిక్షను అనుభవిస్తావు'అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శాపనార్థాలు పెట్టారు.

### ఖాకీ బుక్ ఎక్కడ?

'రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి కూడా పెద్ద పెద్ద సినిమా డైలాగులు కొట్టినాడు - రెడ్ బుక్ ఉండదు, పింక్ బుక్ ఉండదు, ఖాకీ బుక్ ఉంటుంది అని. మరి ఈరోజు కాకి బుక్ ఎక్కడికి పోయింది? మీ పోలీసులను యూజ్ లెస్ ఫెలో అన్న, బట్టలు ఊడదీసి కొడతా అన్న కేసు ఎందుకు పెట్టడం లేదు?'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు.'రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది కాబట్టి వాళ్లకు ఒక నీతి, ప్రతిపక్షంలో ఉన్నాము కాబట్టి మాకు ఒక నీతి అనే



విషయాన్ని డీజీపీ తెలియజేయాలి. డీజీపీ గానీ, రేవంత్ రెడ్డి గానీ అధికారం ఎవడికీ శాశ్వతం కాదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. రానున్న రెండు సంవత్సరాల్లో కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు, రాష్ట్రంలో గులాబీ జెండా ఎగురుతుంది. కచ్చితంగా మీ అరాచకాలకు అప్పుడు తగిన శిక్షను అనుభవిస్తారు. ఈరోజు చట్టాలను, ప్రజాస్వామ్యాన్ని, న్యాయాన్ని, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కే ప్రతి ఒక్కరిని వదిలిపెట్టకుండా ఎక్కడున్నా పట్టుకొని ఖచ్చితంగా శిక్షిస్తాం'అని కేటీఆర్ హెచ్చరించారు. 'ఇక ఎలక్షన్ కమిషన్ కూడా ప్రజాస్వామికంగా, రాజ్యాంగబద్ధంగా పనిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. వెంటనే క్యాతన్‌పల్లి మరియు ఇబ్రహీంపట్నం, ఖానాపూర్‌లో ఎన్నికలు నిజాయితీగా, పారదర్శకతగా పెట్టాలి. సీసీ కెమెరాల మధ్య సీనియర్ అధికారుల పర్యవేక్షణలో ఎన్నికలు జరగనివ్వండి. గెలిచిన వాళ్లను ప్రమాణ స్వీకారం చేయనియ్యండి'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు.




*రాత్రి మూడు గంటలు దాటాయి. నగరం పూర్తిగా నిద్రలోకి జారిపోయింది. వీధుల్లో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. తలుపులు మూసుకున్న ఇళ్లలో కుటుంబాలు ప్రశాంతంగా విశ్రాంతి తీసుకుంటున్నాయి. పిల్లలు భద్రంగా నిద్రపోతున్నారు. వృద్ధులు నిర్భయంగా కునుకుతీస్తున్నారు. ఈ ప్రశాంతత సహజంగా వచ్చినది కాదు, యాదృచ్ఛికంగా దక్కినదీ కాదు. దీని వెనుక ఒక నిరంతర అప్రమత్తత ఉంది, ఒక మౌన త్యాగం ఉంది, ఒక నిద్రలేని జీవితం ఉంది. ఆ జీవితం పేరు - ఖాకీ.*






# పోలీస్ స్టోరీ..
# బతుకు బేజారీ

## 24 గంటల డ్యూటీ.. అయినా అలుసే.. పండుగలు, పబ్బాలు ఉండనే ఉండవు

యూనిఫాం వేసుకున్న క్షణం నుంచే ఒక పోలీసు వ్యక్తిగత జీవితం నెమ్మదిగా వెనక్కి నెట్టబడుతుంది. ఇంట్లో తండ్రిగా, భర్తగా, కుమారుడిగా ఉండాల్సిన మనిషి ఒక్కసారిగా ప్రజల భద్రతకు అంకితమవుతాడు. సేవకుడిగా పిలుస్తారు, రక్షకుడిగా ఆశ్రయిస్తారు, అవసరం వచ్చినప్పుడు ముందు వరుసలో నిలబెడతారు. కానీ ఆ యూనిఫాం వెనుక ఉన్న మనిషిని మాత్రం చాలా అరుదుగా చూస్తారు. అతడికీ అలసట ఉంటుంది. అతడికీ నిద్ర కావాలి. అతడికీ కుటుంబంతో గడపాలనే కోరిక ఉంటుంది. డ్యూటీ ముగిసిన తరువాత ఇంటికి చేరే సమయానికి పిల్లలు నిద్రలో ఉంటారు. పండుగ రోజున ఇంట్లో వెలిగే దీపాలు అతడికి దూరంగా ఉంటాయి. భార్య ఎదురు చూసే తలుపు చప్పుడు ఆలస్యమవుతుంది. తల్లి ఫోన్ చేసి "బాగున్నావా?" అని అడిగితే, "అన్నీ బాగున్నాయి" అని చెప్పడం తప్ప తన మనసులో ఉన్న ఒత్తిడిని చెప్పుకునే అవకాశం ఉండదు. రాజకీయ ఒత్తిళ్లు, ప్రజల ఆగ్రహం, పని భారం, నిద్రలేమి.. ఈ అన్నిటిని లోపలే దాచుకుని మరుసటి రోజు మళ్లీ అదే యూనిఫాం వేసుకుని విధికి బయల్దేరుతాడు. మన భద్రత కోసం తన బతుకును పక్కకు పెట్టే ఈ జీవితం గురించి సమాజం చాలా తక్కువగా ఆలోచిస్తుంది. తప్పు జరిగితే వేలి చూపులు, మాటల దాడులు ఉంటాయి. కానీ తప్పు జరగకుండా ఆపిన నిశ్శబ్ద ప్రయత్నాల గురించి మాత్రం ఎవ్వరూ మాట్లాడరు. ఇదే పోలీస్ స్టోరీ.. నిద్రలేని కళ్లతో సమాజాన్ని కాపాడుతూ, మౌనంగా బాధను మోస్తూ, గుర్తింపులేమిలో బతుకును గడుపుతున్న ఖాకీ కథ. ఇదే బతుకు బేజారీ.

### చట్టం నిలబడాలంటే ఖాకీ నిలబడాలి

సమాజం శాంతిగా ఉండటం సహజంగా జరిగిపోయే విషయం కాదు. అది ప్రతిరోజూ, ప్రతిగంటా చట్ట అమలు ద్వారా, క్రమశిక్షణ ద్వారా, నిరంతర అప్రమత్తత ద్వారా నిర్మితమయ్యే వ్యవస్థ. నేరం జరిగితే అది వార్త అవుతుంది. కానీ నేరం జరగకుండా ఆపిన లక్షలాది క్షణాలు వార్తలకెక్కవు. ఆ నిశ్శబ్ద విజయాల వెనుక నిలిచే జీవితం పోలీస్ జీవితం. ఇది ఒక్కరోజు పని కాదు, ఒక్క ఘటనతో ముగిసే బాధ్యత కాదు; ఇది ఒక నిరంతర పోరాటం. పోలీసు విధులు అనగానే చాలామందికి అరెస్టులు, లాఠీచార్జీలు, కేసులు మాత్రమే గుర్తుకొస్తాయి. కానీ వాస్తవం మరింత విస్తృతమైనది. నేరాల నిరోధం అంటే కేవలం నేరం జరిగిన తర్వాత చర్య తీసుకోవడం కాదు; నేరం జరగకముందే పరిస్థితులను గమనించి, ఉద్రిక్తతలను చల్లార్చి, వివాదాలను అదుపులో పెట్టడం. ప్రజా శాంతి భద్రతల పరిరక్షణ అంటే కేవలం బందోబస్తు కాదు; ప్రజలు భయపడకుండా జీవించగలిగే వాతావరణాన్ని కాపాడటం. ఎన్నికల బందోబస్తు అంటే పోలింగ్ రోజు మాత్రమే కాదు; రాజకీయ ఉద్రిక్తతలు రగలకుండా నెలల తరబడి అప్రమత్తంగా ఉండటం. విఐపీల భద్రత అంటే వ్యక్తులను కాపాడటం మాత్రమే కాదు; వారి చుట్టూ జరిగే ప్రతి కదలిక సమాజ శాంతిపై ప్రభావం చూపకుండా చూడటం. ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు పోలీసులు కేవలం చట్ట పరిరక్షకులు కాదు; వారు సహాయకులుగా మారతారు. వరదల్లో ప్రజలను రక్షించడం, ప్రమాదాల్లో గాయపడినవారిని ఆసుపత్రులకు చేర్చడం, విపత్తుల సమయంలో ఆహారం, ఔషధాలు అందించడం.. ఇవి పోలీస్ యూనిఫాం నిర్వచనంలో భాగం కాని, పోలీస్ బాధ్యతలో భాగమైన పనులు. ఇలాంటి సందర్భాల్లో పోలీసులు తమ ప్రాణాలను కూడా లెక్కచేయకుండా ముందుకు వస్తారు. కానీ ఆ త్యాగం చాలా సార్లు కేవలం "డ్యూటీ"గా మాత్రమే గుర్తించబడుతుంది. పోలీస్ స్టేషన్ అనేది కేవలం ఫిర్యాదులు నమోదు చేసే కార్యాలయం కాదు. అది బాధపడుతున్నవారికి చివరి ఆశగా మారే స్థలం. న్యాయం దొరకదేమో అన్న భయంతో వచ్చిన వ్యక్తి అక్కడి నుంచి కొంత భరోసాతో తిరిగి వెళ్తే, అది పోలీస్ వ్యవస్థ చేసిన పెద్ద సేవ. ఒక చిన్న గొడవ పెద్ద నేరంగా మారకుండా ఆపడం, ఒక కుటుంబ వివాదం హింసకు దారి తీయకుండా చల్లార్చడం, ఒక గ్రామంలో ఉద్రిక్తత చెలరేగకుండా ముందే నియంత్రించడం.. ఇవి అన్నీ బయటికి కనిపించని సమాజాన్ని నిలబెట్టే కీలక చర్యలు. ఈ వ్యవస్థ ఒక్కరోజు సడలినా ఏమవుతుందో ఊహించడమే భయంకరం. ట్రాఫిక్ నియంత్రణ లేకుంటే రహదారులు అస్తవ్యస్తమవుతాయి. శాంతి భద్రతల పర్యవేక్షణ లేకుంటే చిన్న వివాదాలే పెద్ద ఘర్షణలుగా మారతాయి. చట్టం అమలు బలహీనమైతే బలవంతుడే రాజ్యం చేస్తాడు. అప్పుడు నష్టపోయేది పోలీస్ వ్యవస్థ కాదు; సామాన్య పౌరుడే. అందుకే చెప్పాలి.. చట్టం నిలబడాలంటే ఖాకీ నిలబడాలి. ఖాకీ నిలబడాలంటే కేవలం అధికారాలు కాదు, మనోధైర్యం కూడా అవసరం. ఆ మనోధైర్యం ప్రజల విశ్వాసంతో, సమాజం ఇచ్చే గౌరవంతోనే బలపడుతుంది. పోలీస్ వ్యవస్థ బలంగా ఉంటేనే చట్టం బలంగా ఉంటుంది. చట్టం బలంగా ఉంటేనే సమాజం ప్రశాంతంగా ఉంటుంది.

### పండుగల వేళ ప్రజలకు ఆనందం... పోలీసులకు పరీక్ష

సంక్రాంతి, దసరా, నూతన సంవత్సరం వంటి పండుగలు ప్రజలకు సంబరాల సమయం. ఇళ్లలో పిండివంటలు, బంధుమిత్రుల కలయిక, ఆలయాలు--పండుగ వేదికల సందడి.. అన్నీ కలిసి ఆనందాన్ని నింపుతాయి. కానీ అదే సమయంలో పోలీసులకు ఇది అత్యంత పరీక్షాకాలం. ప్రజల ఆనందం భద్రంగా కొనసాగాలంటే వారి అప్రమత్తత రెట్టింపు కావాల్సి వస్తుంది. పండుగల వేళ చోరీలు పెరగకుండా చూడటం, రహదారులపై ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్‌ను నియంత్రించడం, చిన్న వివాదాలు పెద్ద గొడవలుగా మారకుండా ముందే అడ్డుకోవడం.. ఇవి అన్నీ ఒకేసారి జరిగే బాధ్యతలు. ఈ రోజుల్లో పోలీసులు నైట్ పెట్రోలింగ్‌ను పెంచుతారు, సీసీటీవీ నిఘాను కఠినతరం చేస్తారు, ప్రధాన రహదారులు, మార్కెట్లు, ఆలయాల వద్ద అదనపు బందోబస్తు ఏర్పాటు చేస్తారు. మద్యం మత్తులో వాహనాలు నడిపేవారిని అడ్డుకోవడం, రద్దీ కారణంగా ట్రాఫిక్ స్థంభించకుండా చూడటం, అనుకోని ప్రమాదాలు జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవడం.. ఇవి కేవలం అధికారిక విధులు కాదు; ఇవి ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన బాధ్యతలు. ఇదే సమయంలో ప్రజలకు జాగ్రత్త సూచనలు కూడా ఇస్తారు.. ఇళ్లలో లైట్లు వెలిగించి వెళ్లాలని, పొరుగువారికి సమాచారం ఇవ్వాలని, విలువైన వస్తువులు సురక్షితంగా ఉంచాలని, అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని. ఈ సూచనల వెనుక ఉన్న ఉద్దేశం ఒక్కటే.. పండుగ ఆనందం విషాదంగా మారకూడదు. కానీ ఈ సమస్త ఏర్పాట్ల వెనుక ఒక మౌన త్యాగం దాగి ఉంటుంది. మనం పండుగ భోజనాల్లో మునిగిపోయిన వేళ, కుటుంబంతో నవ్వులు పంచుకుంటున్న వేళ, ఖాకీ మాత్రం రోడ్డుపై నిలబడి ఉంటుంది. పిల్లలు తండ్రి కోసం ఎదురు చూసే వేళ, భార్య పండుగ రోజున కూడా తలుపు వైపు చూస్తూ ఉండే వేళ, పోలీసు విధిలోనే ఉంటాడు. ప్రతి అదనపు డ్యూటీ గంట ఒక కుటుంబానికి దూరమయ్యే సమయం. ప్రతి పండుగ రోజు ఒక పోలీసు ఇంట్లో సాధారణ రోజుగా మారిపోతుంది. ఇదే పండుగల వాస్తవం.. ప్రజలకు ఆనందం, పోలీసులకు పరీక్ష. ఈ పరీక్షలో వారు తడబడితే సమాజమే మూల్యం చెల్లించాల్సి వస్తుంది. అందుకే ఖాకీ అప్రమత్తతే పండుగల నిజమైన భద్రత. మన సంబరాల వెనుక నిలిచిన ఈ మౌన కాపలాను గుర్తించడమే పండుగల అసలు అర్థం.

### సేవలకు గుర్తింపు ఉంది... కానీ సరిపోతుందా?

పోలీసుల సేవలకు గుర్తింపుగా ప్రభుత్వాలు విశిష్ట సేవా పతకాలు, అవార్డులు, ప్రశంసలు ప్రకటిస్తుంటాయి. విధుల్లో అసాధారణ ప్రతిభ చూపిన వారికి వేదికలపై అభినందనలు, ప్రశంసా పత్రాలు అందజేస్తారు. ఇవి అవసరమే. అవి పోలీసుల్లో పని పట్ల గర్వాన్ని పెంచుతాయి, సేవా భావనకు ప్రోత్సాహం ఇస్తాయి. కానీ ఈ గుర్తింపుల దగ్గరే ఒక మౌలిక ప్రశ్న నిలుస్తుంది.. ఈ గౌరవాలు వారి రోజువారీ జీవితంలో ఎదురయ్యే అలసటను తగ్గిస్తాయా? వారి భుజాలపై పేరుకుపోయే ఒత్తిడిని తేలిక చేస్తాయా? ఒక పతకం పోలీసు యూనిఫాం మీద మెరుస్తుంది. కానీ ఆ యూనిఫాం లోపల ఉన్న మనిషి మనసులో పేరుకుపోయే వేదనకు అది మందు కాదు. రోజూ విధిలో ఎదురయ్యే ప్రజల ఆగ్రహం, అనుమానాలు, దూషణలు, రాజకీయ ఒత్తిళ్లు.. ఇవి పతకాలతో తొలగిపోవు. కొద్ది క్షణాల వేదిక గౌరవం తరువాత మళ్లీ అదే వాస్తవం ఎదురవుతుంది. రాత్రి విధులు, నిరంతర అప్రమత్తత, కుటుంబానికి దూరంగా ఉండాల్సిన బాధ.. ఇవన్నీ యథాతథంగా కొనసాగుతాయి. ఇంకా ముఖ్యమైనది ఏమిటంటే, గౌరవం కేవలం వేదికలపై మాత్రమే ఉండకూడదు. అది రోజువారీ వ్యవహారాల్లో కనిపించాలి. పోలీసును చూసినప్పుడు మాటల్లో గౌరవం ఉండాలి. విధుల్లో ఉన్నప్పుడు అనవసర అవమానాలు, అనుమానాలు ఉండకూడదు. తప్పు జరిగితే చట్టబద్ధంగా ప్రశ్నించాలి; కానీ మొత్తం వ్యవస్థనే దూషించే ధోరణి సమాజానికి మేలు చేయదు. యూనిఫాం తీసేసిన తర్వాత కూడా అతను ఒక తండ్రి, ఒక భర్త, ఒక కుమారుడు అనే వాస్తవాన్ని గుర్తించడమే నిజమైన గౌరవం. సేవలకు గుర్తింపు అంటే కేవలం పతకాలు ఇవ్వడం కాదు. అది పోలీసుల పని పరిస్థితులను మెరుగుపరచడం, మానసిక ఒత్తిడిని తగ్గించే చర్యలు తీసుకోవడం, కుటుంబ జీవితం--విధి మధ్య సమతుల్యం కల్పించడం కూడా కావాలి. సెలవులు, విశ్రాంతి, కౌన్సెలింగ్ వంటి మద్దతు వ్యవస్థలు లేకపోతే గౌరవం అర్థం కోల్పోతుంది. అందుకే ప్రశ్న మరింత లోతుగా మారుతుంది---సేవలకు గుర్తింపు ఉందా? ఉంది. కానీ అది సరిపోతుందా? సమాజం నిజంగా ఖాకీకి గౌరవం ఇవ్వాలంటే, వేదికలపై మెరుస్తున్న పతకాలకంటే ముందుగా రోజువారీ జీవితంలో మానవీయ గౌరవాన్ని చూపించాలి. అప్పుడు మాత్రమే గుర్తింపు సంపూర్ణమవుతుంది.

ఒక సామాజిక వాస్తవం.. ఖాకీ వెనుక ఉన్న మనిషి ఎదుర్కొంటున్న మౌన పోరాటం.

### 24/7 డ్యూటీ.. కానీ 24/7 మనిషే..

పోలీసుల పని సమయాన్ని గడియారం కొలవదు. "షిఫ్ట్ అయిపోయింది" అనే మాట వారి జీవితంలో అరుదుగా వినిపిస్తుంది. సిబ్బంది కొరత, విపరీతమైన పని భారం, రాజకీయ ఒత్తిళ్లు.. ఇవి అన్నీ కలిసి 24 గంటల డ్యూటీని సాధారణ పరిస్థితిగా మార్చేశాయి. ఒక విధి ముగిసేలోపే మరో బాధ్యత మొదలవుతుంది. రాత్రి పహారా నుంచి ఉదయపు ట్రాఫిక్ నియంత్రణ వరకు, ఆపై కోర్టు హాజరు, మధ్యలో ఫిర్యాదులు.. ఇలా ఒక పోలీసు రోజు నిరంతరంగా నడుస్తూనే ఉంటుంది. ఈ దీర్ఘ షిఫ్టుల ప్రభావం మొదట కుటుంబంపై పడుతుంది. పిల్లలతో గడపాల్సిన సమయం కరిగిపోతుంది. పాఠశాల సమావేశాలు, పండుగలు, కుటుంబ వేడుకలు.. అన్నీ "డ్యూటీ ఉంది" అనే ఒక్క వాక్యంతో దూరమవుతాయి. భార్యాభర్తల మధ్య సంభాషణ తగ్గిపోతుంది; చిన్న చిన్న అపార్థాలు పెద్దవిగా మారతాయి. తల్లిదండ్రుల అనారోగ్యం చూసుకునే అవకాశం కూడా చాలాసార్లు ఉండదు. ఇలా కుటుంబ జీవితం నెమ్మదిగా ఒత్తిడిలోకి జారుతుంది. మానసిక ఆరోగ్యంపై ప్రభావం మరింత తీవ్రమైనది. నిరంతర అప్రమత్తత, ప్రజల ఆగ్రహం, నేర దృశ్యాల మధ్య పనిచేయడం.. ఇవి మనసుపై భారంగా పేరుకుపోతాయి. నిద్రలేమి సాధారణమవుతుంది. కోపం, చిరాకు పెరుగుతాయి. ఆందోళన, ఒంటరితనం, నిరాశ వంటి భావాలు చోటుచేసుకుంటాయి. కానీ "బలంగా ఉండాలి" అనే అంచనాతో చాలామంది తమ సమస్యలను లోపలే దాచుకుంటారు. సహాయం కోరడం బలహీనతగా భావించే వాతావరణం కూడా ఈ ఒత్తిడిని పెంచుతుంది. ఇది కేవలం ఉద్యోగ కఠినత కాదు; ఇది ఒక సామాజిక వాస్తవం.. ఖాకీ వెనుక ఉన్న మనిషి ఎదుర్కొంటున్న మౌన పోరాటం.

### ఖాకీ సంక్షేమమే.. భద్రతకు పునాది

పోలీసు వ్యవస్థలో సంస్కరణలు ఇక ఆలస్యం కాకూడదు. ఇది కేవలం ఉద్యోగ సంక్షేమం ప్రశ్న కాదు; సమాజ భద్రతకు సంబంధించిన అత్యవసర అవసరం. నిరంతర డ్యూటీలు, పని భారం, విశ్రాంతిలేమి పోలీసు మనోధైర్యాన్ని దెబ్బతీస్తున్న పరిస్థితిలో వారికి క్రమబద్ధమైన విశ్రాంతి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది. పోలీస్ స్టేషన్లు, బందోబస్తు కేంద్రాల్లో ప్రత్యేక విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలి. విధి మధ్యలో కొంతసేపు మనసు ప్రశాంతంగా ఉంచుకునే వాతావరణం కల్పించాలి. పిల్లలు, కుటుంబ సభ్యులు, వృద్ధ తల్లిదండ్రులను కలిసేలా వారికి సమయం కేటాయించాలి. పని--జీవిత సమతుల్యాన్ని సాధించే విధంగా సెలవులు, వారాంత విశ్రాంతి తప్పనిసరి చేయాలి. పోలీసులకు విహారయాత్రలు, కుటుంబంతో గడిపే కార్యక్రమాలకు ప్రోత్సాహకాలు అందించాలి. మానసిక ఒత్తిడిని తగ్గించాలి. అలాగే సిబ్బంది కొరతను భర్తీ చేసి పని భారాన్ని తగ్గించాలి. సాధ్యమైన చోట్ల 8 గంటల పని గంటల విధానం అమలు చేయాలి. కౌన్సెలింగ్, మానసిక ఆరోగ్య మద్దతు, పిల్లల విద్యకు సహాయం, వైద్య సదుపాయాలు వంటి సంక్షేమ చర్యలు బలపరిస్తేనే పోలీసు వ్యవస్థ బలంగా నిలబడుతుంది. ఖాకీ మనిషిగా నిలబడితేనే చట్టం నిలబడుతుంది. ఈ సత్యాన్ని పాలకులు, వ్యవస్థలు ఇకైనా గుర్తించాల్సిన సమయం వచ్చింది.

### విమర్శ అవసరం.. అవమానం కాదు

పోలీసుల్లో తప్పులు ఉండవచ్చు. అవినీతి, నిర్లక్ష్యం, అధికార దుర్వినియోగం జరిగితే ప్రశ్నించాలి; చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలి. ఇది ప్రజాస్వామ్యానికి అవసరమైన ప్రక్రియ. కానీ ఈ అవసరమైన విమర్శ ఒక గీత దాటినప్పుడు అది అవమానంగా మారుతుంది. ఒక వ్యక్తి తప్పు చేశాడని మొత్తం వ్యవస్థను దూషించడం, విధుల్లో ఉన్న పోలీసులను బహిరంగంగా తిట్టడం, రాజకీయ ప్రయోజనాల కోసం ఖాకీని లక్ష్యంగా చేసుకోవడం సమాజానికి మేలు చేయదు. అవమానం పోలీసు మనోధైర్యాన్ని నెమ్మదిగా దెబ్బతీస్తుంది. మనోధైర్యం కోల్పోతే విధుల్లో ధైర్యం తగ్గుతుంది; ధైర్యం తగ్గితే నేరస్తుడికి ధైర్యం పెరుగుతుంది. చట్టం బలహీనమవుతుంది. చివరకు నష్టపోయేది పోలీసు కాదు.. సామాన్య పౌరుడే. విమర్శకు స్థానం ఉండాలి; కానీ మానవత్వం తప్పనిసరి. పోలీసు యూనిఫాం ఒక కవచం కావచ్చు, కానీ దాని లోపల ఉన్నది మనిషే. అతడికీ అలసట ఉంటుంది, అతడికీ బాధ ఉంటుంది, అతడికీ కుటుంబం ఉంటుంది. ఈ నిజాన్ని గుర్తించి మాట్లాడినప్పుడు మాత్రమే విమర్శ నిర్మాణాత్మకంగా మారుతుంది. చట్టాన్ని బలపరిచే విమర్శే సమాజాన్ని రక్షిస్తుంది; అవమానం కాదు.

**- కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్**

## గౌరవమే నిజమైన మద్దతు

ఈ కథనం పోలీసులను పొగడటానికి రాయబడింది కాదు. వారిని విమర్శలకు అతీతంగా నిలబెట్టాలన్న ఉద్దేశ్యమూ కాదు. కానీ ఒక విషయాన్ని మాత్రం సమాజం గట్టిగా గుర్తు పెట్టుకోవాలని ఇది కోరుతుంది. మన భద్రత వెనుక నిలిచింది ఒక వ్యవస్థ మాత్రమే కాదు, ఒక మనిషి జీవితం. యూనిఫాం వెనుక కూడా హృదయం ఉంది, అలసట ఉంది, బాధ ఉంది, ఆశ ఉంది. ఖాకీ అనేది కేవలం అధికారానికి చిహ్నం కాదు; అది బాధ్యతకు, త్యాగానికి, మౌన సహనానికి గుర్తు. పోలీసులను విమర్శించడం ప్రజాస్వామ్యంలో సహజమే. తప్పు జరిగితే ప్రశ్నించాలి. నిర్లక్ష్యం ఉంటే సరిదిద్దాలి. కానీ ఆ విమర్శలో మానవత్వం ఉండాలి. అవమానం, దూషణ, నిర్లక్ష్యం పోలీస్ వ్యవస్థను బలహీనపరుస్తాయి. వ్యవస్థ బలహీనమైతే.. చట్టం బలహీనమవుతుంది. చట్టం బలహీనమైతే.. భద్రత బలహీనమవుతుంది. ఈ అనుసంధానాన్ని మనం విస్మరించలేం. నిజమైన మద్దతు వేదికలపై ఇచ్చే చప్పట్లలో కాదు. అది రోజువారీ ప్రవర్తనలో కనిపించాలి. విధుల్లో ఉన్న పోలీసుతో మాట్లాడే మాటల్లో, అతడి నిర్ణయాలను అర్థం చేసుకునే ధోరణిలో, అవసరం లేని అనుమానాలు.. అవమానాలు దూరంగా పెట్టడంలో కనిపించాలి. యూనిఫాం తీసేసిన తర్వాత కూడా అతడు ఒక తండ్రి, ఒక భర్త, ఒక కుమారుడు అనే సత్యాన్ని గుర్తించడమే నిజమైన గౌరవం. మన రేపటి భద్రత కోసం ఖాకీని బలంగా నిలబెట్టాలంటే కేవలం అధికారాలు ఇవ్వడం సరిపోదు. అతడి మనోధైర్యాన్ని కాపాడాలి. పని--జీవిత సమతుల్యం, మానసిక ఆరోగ్యానికి మద్దతు, కుటుంబ జీవితం గౌరవించబడే వాతావరణం.. ఇవి లేకుండా భద్రత నిలవదు. పోలీసు మనిషిగా నిలబడితేనే చట్టం గట్టిగా నిలబడుతుంది. ఈ రాత్రి మనం ప్రశాంతంగా నిద్రపోతున్నాం. అది మన అదృష్టం కాదు; అది ఖాకీ అప్రమత్తత ఫలితం. ఆ అప్రమత్తత వెనుక ఒక మనిషి మేల్కొని ఉన్నాడు. అతడి నిద్రను త్యాగం చేసి మన నిద్రను కాపాడుతున్నాడు. ఆ సత్యాన్ని గుర్తించడం, ఆ త్యాగానికి గౌరవం ఇవ్వడం.. అదే సమాజం ఖాకీకి ఇవ్వగలిగే నిజమైన మద్దతు.

## సోషల్ వాణి



### అగ్రవర్ణమా?
### బడుగులు పీకపై
### మరణపాదమా?

కుల రక్కసి కాళ్లకిందముక్కుపచ్చలారని
జీవితం తెల్లారింది..
అగ్రవర్ణ దురహంకారానికి భావి భారత భవిష్యత్తు
తల్లి ఒడిలోనే కన్నుమూసింది
అందరినీ కాపుకాచే
దేవుడి సన్నిధిలో కులం కోరలకు చిక్కి
పసిపాణం బలైపోయింది.
కుల మదంతో మానవత్వం మంటగలిసిన చోట
పసిమొగ్గ రాలిపోయింది..
మైల బట్టలను మల్లెపువ్వులెక్క
మార్చిన చేతుల్లో ఈ అగ్రవర్ణం..
బిడ్డ శవాన్ని పెట్టింది.. దేవుడు అందరివాడుకదా..
మేమెందుకు పైసల్లేకుండా
చూడొద్దని ప్రశ్నించడమే పాపమైపోయింది.
తక్కువ కులపోడి ప్రశ్నను జీర్ణించుకోలేని
ఆ అగ్రవర్ణ పాదం బడుగు బిడ్డ
పీకపై కాలితో మరణశాసనం రాసింది
ఎన్నో అవమానాలు పడ్డ పాణాలు
నోరులేని అభాగ్యపు బతుకులు..
అందుకే ఆ తల్లిదండ్రుల ఘోష
వినిపించకుండా ఈ సమాజం చెవిటిదైపోయింది..

**- రాజు అతికం, 9440012834**

(నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామ ఉదంతం బాధాకరం.. అగ్రవర్ణాల కాళ్లకింద బలైపోయిన ఆ చిన్నారికి నా అక్షర నివాళి ఇది..)

## 104 సైబర్ దొంగల అరెస్ట్

**ఆపరేషన్ ఆక్టోపస్ సక్సెస్**

**వివరాలు వెల్లడించిన సజ్జనార్**

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఈవార్తలు): హైదరాబాద్ పోలీసులు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో చేపట్టిన భారీ ఆపరేషన్‌లో, దేశంలోని 16 రాష్ట్రాల్లో విస్తరించిన అతిపెద్ద సైబర్ నేరాల ముఠా గుట్టురట్టు చేశారు. పెట్టుబడులు, ట్రేడింగ్, 'డిజిటల్ అరెస్ట్' వంటి మోసాలతో అమాయక ప్రజల నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్న ఈ నెట్‌వర్క్‌కు చెందిన 104 మందిని అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్ వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఇటీవలి కాలంలో సైబర్ మోసాలు విపరీతంగా పెరిగిపోయాయి. అమాయకులను నమ్మించి, భయపెట్టి, వారి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్న ఘటనలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో డీసీపీ (సైబర్‌క్రైమ్స్) వి. అరవింద్ బాబు నేతృత్వంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఈ మోసాలపై లోతైన దర్యాప్తు చేపట్టారు. నేరగాళ్లు బాధితుల నుంచి దోచుకున్న సొమ్మును మళ్లించడానికి ఉపయోగిస్తున్న 151 బ్యాంకు ఖాతాలను గుర్తించారు. ఈ ఖాతాల ఆధారంగా దేశవ్యాప్తంగా విస్తరించిన ముఠా వివరాలను ఛేదించారు. ఈ భారీ నెట్‌వర్క్‌ను



కూకటివేళ్లతో పెకిలించేందుకు 32 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల నేతృత్వంలోని ఈ బృందాలు 10 రోజుల పాటు మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, గుజరాత్, హర్యానా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, అస్సాం, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరాఖండ్, ఒడిశా రాష్ట్రాల్లో ఏకకాలంలో మెరుపుదాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో మొత్తం 104 మందిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో 86 మంది 'మ్యూల్ అకౌంట్ హోల్డర్లు' ఉన్నారు. వీరు తమ బ్యాంకు ఖాతాలను కమీషన్ కోసం సైబర్ నేరగాళ్లకు అప్పగించారు. మరో 17 మంది ఈ ఖాతాలను సేకరించి ముఠా సూత్రధారులకు అందించే ఏజెంట్లుగా పనిచేస్తున్నారు. అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఈ ముఠాతో కుమ్మక్కై నకిలీ ఖాతాలు తెరిచేందుకు సహకరించిన బంధన్ బ్యాంకుకు చెందిన ఓ రిలేషన్‌షిప్ మేనేజర్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన ఈ నిందితులకు దేశవ్యాప్తంగా నమోదైన 1,055 సైబర్ ఫ్రాడ్ కేసులతో సంబంధం ఉన్నట్లు తేలిందని, ఈ మోసాల మొత్తం విలువ సుమారు రూ.127 కోట్లు ఉంటుందని కమిషనర్ తెలిపారు.

## ఎస్సారెస్పీ కెనాల్లో దూకి
# మహిళ ఆత్మహత్య

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 24 (ఈవార్తలు): జగిత్యాల నూకపల్లి అర్బన్ కాలనీలో దారుణం చోటు చేసుకుంది. అప్పు చెల్లించాలని అనూష అనే వివాహిత ఇంటి వద్ద నలుగురుగొడవకు దిగారు. అవమానం భరించలేక ఆటోలో బయలు దేరిన బాధితురాలు అనూష వెంటే గొడవకు దిగిన ఇద్దరు మహిళలు సైతం ఆటోలోనే వెంబడించారు. కొద్ది దూరం వెళ్లాక రాజారం వద్ద ఎస్సారెస్పీ కెనాల్‌లో దూకి వారి ముందే అనూష ఆత్మహత్యకు ప్రయ్నతించింది. అయితే, ఆమెను కాపాడే ప్రయత్నం కూడా



చేయకుండా ఆటోలో అక్కడి నుంచి వెళ్లిపోయారు. స్థానికులు కాపాడేలోపే అనూష మృతి చెందింది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని బయటకు తీశారు.. గొడవకు దిగిన వారిలో విజయవాడ సమీపంలోని కంకిపాడుకు చెందిన ఓంకార్, సతీస్, శిరీష, అనూషగా గుర్తించారు. వారు పరారిలో ఉండగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, భర్త ఉన్నారు.

## ప్రతిభ చాటిన ట్రైనర్‌కు ఘన సత్కారం

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఈవార్తలు): ఈ నెల 20, 21, 22 తేదీలలో నిర్వహించిన “మెగా ఇంపాక్ట్ 2026” కార్యక్రమం ఘనంగా జరిగింది. మూడు రోజుల పాటు సాగిన ఈ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న ట్రైనర్లు, మోటివేషనల్ స్పీకర్లు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ గంప నాగేశ్వరరావు పాల్గొన్న వారిని అభినందించారు. కార్యక్రమంలో భాగంగా ట్రైనింగ్ రంగంలో విశేష కృషి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఇందులో భాగంగా ఇంపాక్ట్ బంధం టీమ్ తరుపున ప్రవీణ్ సర్టిఫికెట్ అందుకున్నారు. ఆయనకు సర్టిఫైడ్ ట్రైనర్ సర్టిఫికేట్‌తో పాటు బెస్ట్ ట్రైనర్, మోటివేషనల్ స్పీకర్ అవార్డును సంద్ర సుధీర్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు మాట్లాడుతూ.. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది.



## ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య
### హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లో విషాదం

అంబర్‌పేట–హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఈవార్తలు): అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఆర్థిక ఇబ్బందులే ఈ ఘోర నిర్ణయానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. మృతులను రామరాజు (55), ఆయన భార్య మాధవి (50), మరియు కుమారుడు శశాంక్ (24)గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. రామరాజు స్థానికంగా హోటల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా వ్యాపారంలో నష్టాలు రావడంతో రామరాజు అప్పుల పాలయ్యారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం రామరాజు ఇంటి తలుపులు తెరుచుకోకపోవడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు.. తలుపులు తెరిపించి చూడగా లోపల ముగ్గురూ విగతజీవులుగా కనిపించారు. రామరాజు, మాధవి ఉరివేసుకుని ప్రాణాలు తీసుకోగా, శశాంక్ తన మణికట్టు కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పుల భారం పెరిగిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై కుటుంబమంతా ఈ విపరీత నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు.. కేసు నమోదు చేసి ఆర్థిక లావాదేవీల కోణంలో విచారణ జరుపుతున్నారు.

## యువకుడికి గుండె మార్పిడితో కొత్త జీవితం
### మంత్రి సత్యకుమార్ చొరవ

అమరావతి, ఫిబ్రవరి 24 (ఈవార్తలు): ఏపీ వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చూపిన చొరవ ఓ యువకుడికి ప్రాణం పోసింది. తీవ్రమైన గుండె సమస్యతో బాధపడుతున్న యువకుడికి మంత్రి సహాయంతో గుండె మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా జరిగింది. శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన చరణ్ కుమార్ అనే యువకుడు మూడు వారాల క్రితం గుండె సంబంధిత సమస్యతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరాడు. అతడికి గుండె మార్పిడి తప్పనిసరి అని వైద్యులు స్పష్టం చేశారు. దీంతో చరణ్ తల్లిదండ్రులు మంత్రి సత్యకుమార్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే స్పందించిన మంత్రి సత్యకుమార్, బెంగళూరులోని దేహీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ వైద్యులతో మాట్లాడారు. చరణ్‌ను ఆ ఆసుపత్రికి తరలించగా, డాక్టర్ దుర్గాప్రసాద్ బృందం ఈ నెల 21న గుండె మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది. బ్రెయిన్ డెడ్ అయిన 27 ఏళ్ల యువకుడి గుండెను దాతల అంగీకారంతో చరణ్‌కు అమర్చారు. ప్రస్తుతం చరణ్ కోలుకుంటున్నారని, ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. తమ కుమారుడికి ప్రాణదానం చేసిన మంత్రికి, వైద్యులకు చరణ్ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## జగన్ తప్పుచేశారని అనలేదు: పవన్

అమరావతి, ఫిబ్రవరి 24 (ఈవార్తలు): తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో వాడిన నెయ్యి కల్తీ వ్యవహారంలో గత ప్రభుత్వ అధినేత తప్పు చేశారని తాను ఎప్పుడూ నిందించలేదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఆనాడు నియమితులైన టీటీడీ పాలకమండలిదే పూర్తి బాధ్యత అని పేర్కొన్నారు. అసెంబ్లీలో ఈ అంశంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ, దోషులను వెనకేసుకు రాకుండా, చట్ట ప్రకారం విచారణకు సహకరించాలని సూచించారు. ఈ వ్యవహారంపై సీఎం చంద్రబాబు ఎన్డీఏ సమావేశంలో నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్డీడీబీ) నివేదికను ప్రస్తావించిన తర్వాతే తనకు పూర్తి వివరాలు తెలిశాయన్నారు. సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నివేదికలోని అంశాలను పవన్ కల్యాణ్ సభలో వివరించారు. లడ్డూల కోసం వినియోగించిన 68 లక్షల కిలోల నెయ్యిలో పాల చుక్క కూడా లేదని, పామాయిల్, ప్రమాదకర రసాయనాలతో దాన్ని తయారు చేశారని సిట్ తేల్చి చెప్పిందన్నారు. ఈ కేసులో 36 మందిని నిందితులుగా చేర్చారని, ఇది శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేసేందుకు ప్రణాళిక ప్రకారం జరిగిన కుట్రగా సిట్ అభివర్ణించిందని తెలిపారు. 2019–24 మధ్య కాలంలో విక్రయించిన 48 కోట్ల లడ్డూలలో సుమారు 20 కోట్ల లడ్డూలు ఈ నకిలీ నెయ్యితోనే తయారయ్యాయని టీటీడీ రికార్డులు చెబుతున్నాయని, తద్వారా 11 కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి పంపిన లక్ష లడ్డూలు కూడా ఈ కల్తీ నెయ్యితో చేసినవేనని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో తమకు నచ్చిన సంస్థలకు నెయ్యి సరఫరా కాంట్రాక్టులు కట్టబెట్టేందుకే ప్రణాళిక ప్రకారం టెండర్ నిబంధనలను నీరుగార్చారని పవన్ ఆరోపించారు. నెయ్యి సరఫరా చేసే సంస్థకు ఉండాల్సిన కనీస వార్షిక టర్నోవర్‌ను రూ.250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు తగ్గించారని, రోజుకు 4 లక్షల లీటర్ల పాలు సేకరించాలన్న నిబంధనను తొలగించారని, మూడేళ్ల అనుభవాన్ని ఏడాదికి కుదించారని వివరించారు. ఈ మార్పుల తర్వాత కాంట్రాక్టు దక్కించుకున్న ‘బోలే బాబా’, ‘వైష్ణవి డైరీస్’ వంటి సంస్థలకు కనీస అర్హతలు కూడా లేవని సిట్ చార్జిషీట్‌లో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై తాను స్పందించకపోవడం పట్ల పశ్చాత్తాపంతోనే దీక్ష చేశానని పవన్ గుర్తుచేసుకున్నారు. ఇది కేవలం కల్తీ వ్యవహారం కాదని, హిందూ ధర్మంపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. “ఇదే ఘటన ఏ ఇతర మతానికి జరిగినా దేశం, ప్రపంచం గగ్గోలు పెట్టేవి. హిందువులు కులాల పేరుతో విడిపోయి ఉండటం వల్లే మన ధర్మంపై దాడులు జరుగుతున్నప్పుడు తీవ్రత ఉండటం లేదు. ఇతర మతాల వారి ఐక్యతను చూసి మనం నేర్చుకోవాలి,” అని అన్నారు. తప్పు చేసిన వారిని వెనకేసుకొస్తున్న వారు తిరుమల వెళ్లి ఆ స్వామి కళ్లలోకి ఎలా చూడగలరని ప్రశ్నించారు. శ్రీకృష్ణదేవరాయులు తన ఆముక్త మాల్యదలో చెప్పిన పద్యాన్ని ఉటంకిస్తూ, దేవుడి సొమ్ముపై ఆశ ఉన్నవారికి ఆలయ అధికారం ఇవ్వరాదని, అలా ఇస్తే రాజ్యమే నాశనమవుతుందని ఆ పద్యం చెబుతోందని, గత ప్రభుత్వంలో సరిగ్గా అదే జరిగిందని పవన్ విమర్శించారు. ఈ పాపానికి పాల్పడిన దోషులు ఎవరైనా వారికి శిక్ష పడాల్సిందేనని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. హిందూ ధర్మంపై దాడులు జరిగినప్పుడు పార్టీలకు అతీతంగా అందరూ ఏకకంఠంతో ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఏపీ అగ్రి వర్సిటీల ప్రొఫెసర్లకు ఊరట

అమరావతి, ఫిబ్రవరి 24 (ఈవార్తలు): ఏపీలోని నాలుగు వ్యవసాయ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. తమ పదవీ విరమణ వయసును 62 నుంచి 65 ఏళ్లకు పెంచకపోవడాన్ని సవాల్ చేస్తూ వారు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టింది. ఉన్నత విద్యాశాఖ పరిధిలోని ప్రొఫెసర్లకు పదవీ విరమణ వయసు పెంచి, వ్యవసాయ శాఖ పరిధిలోని వారికి పెంచకపోవడం వివక్ష చూపడమేనని, ఇది రాజ్యాంగంలోని అధికరణ 14కు విరుద్ధమని జస్టిస్ బట్టు దేవానంద్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ, డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన, శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ, ఏపీ ఫిషరీస్ యూనివర్శిటీల పరిధిలో పదవీ విరమణ చేయనున్న పిటిషనర్లను తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సర్వీసులోనే కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. అలాగే ఈ యూనివర్సిటీలలో పదవీ విరమణ వయసు పెంచడానికి వీల్లేదంటూ ఫిబ్రవరి 15న వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ జారీ చేసిన ఆదేశాలను కూడా హైకోర్టు సస్పెండ్ చేసింది. ప్రభుత్వం దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. గతంలో ఉన్నత విద్యాశాఖ పరిధిలోని వర్సిటీల్లో యూజీసీ స్కేల్స్ పొందుతున్న ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును ప్రభుత్వం 62 నుంచి 65 ఏళ్లకు పెంచింది. అయితే, వ్యవసాయ శాఖ పరిధిలోని నాలుగు వర్సిటీలకు ఈ ప్రయోజనాన్ని వర్తింపజేయలేదు. దీంతో ప్రొఫెసర్లు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై గతంలో సింగిల్ జడ్జి విచారణ జరిపి, ఇది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని పేర్కొన్నారు.




## వైఎస్సార్‌పై వ్యాఖ్యలను తొలగించాలి: షర్మిల

విజయవాడ, ఫిబ్రవరి 24 (ఈవార్తలు): ఏపీ అసెంబ్లీలో తిరుమల లడ్డూ కల్తీపై జరుగుతున్న చర్చ ఇప్పుడు వైఎస్ కుటుంబాన్ని రచ్చకీడ్చమే కాకుండా, రాజకీయంగా కొత్త మలుపులు తిరుగుతోంది. వైసీపీ చేసిన తప్పులను తన తండ్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఆపాదించడంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ‘అత్త మీద కోపం దుత్త మీద చూపినట్లు’ కూటమి ప్రభుత్వ తీరు ఉందని ఎద్దేవా చేస్తూ, అసెంబ్లీ రికార్డుల నుంచి వైఎస్సార్‌పై చేసిన వ్యాఖ్యలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ హయాంలో ఏడు కొండలను రెండు కొండలు చేయాలని చూశారన్న విమర్శలను షర్మిల గట్టిగా తిప్పికొట్టారు. “జరిగిందంతా తప్పుడు ప్రచారమే. నాడు ప్రతిపక్ష నేతగా చంద్రబాబే బురద చల్లారు. వాస్తవానికి ఏడు కొండలు వెంకన్నవేనని 2007లో శాశ్వత జీవో ఇచ్చి చరిత్ర సృష్టించింది వైఎస్సార్” అని ఆమె గుర్తు చేశారు. తిరుమల క్షేత్రంలో అన్యమత ప్రచారాన్ని అడ్డుకోవడానికి జీవో 746, 747లను తీసుకొచ్చి కఠిన నిబంధనలు అమలు చేసిన ఘనత తన తండ్రిదేనని, లడ్డూకు 2009లో అంతర్జాతీయంగా పేటెంట్ రైట్స్ సాధించింది కూడా ఆయనేనని స్పష్టం చేశారు. వైసీపీ పాలనను, వైఎస్సార్ సంక్షేమ పాలనను ఒకటిగా చూడవద్దని షర్మిల హితవు పలికారు. “వైసీపీ పాలన దోచుకుతినే పాలన అయితే, వైఎస్సార్ పాలన పేదల సంక్షేమ పాలన. వైసీపీలో అసలు వైఎస్సార్ లేనే లేడు” అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజశేఖర్ రెడ్డి ముమ్మాటికీ కాంగ్రెస్ మనిషి అని, కడవరకు కాంగ్రెస్‌లోనే బతికిన ఆయనను వ్యక్తిగతంగా దూషించడం చంద్రబాబుకు భావ్యం కాదన్నారు. వేద పండితుల కోసం ‘ఆయుష్మాన్ భవ’, దళితుల కోసం ‘దళిత గోవిందం’ వంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్న మహానేతను దేవుడిగా కొలుస్తారని అన్నారు.

## పులివెందులకు జగన్

పులివెందుల, ఫిబ్రవరి 24 (ఈవార్తలు): వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో రెండు రోజుల పర్యటన ప్రారంభించారు. ప్రజలతో నేరుగా మమేకమై, వారి సమస్యలు తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగుతోంది. ఇందులో భాగంగా ఆయన ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారు. మంగళవారం పులివెందుల చేరుకున్న జగన్‌కు పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన భాకరాపురంలోని క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాత్రికి ఆయన అక్కడే బస చేయనున్నారు. పర్యటనలో భాగంగా రేపు (బుధవారం) ఉదయం 9:30 గంటలకు జగన్ వేంపల్లి మండలం నందిపల్లి గ్రామానికి వెళ్తారు. అక్కడ నూతనంగా నిర్మించిన నందీశ్వర ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం పులివెందులకు తిరిగి వచ్చి, మధ్యాహ్నం మరోసారి క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడానికే ఈ పర్యటన చేపట్టారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.


# 95 వేలకే మోకాలి కీలు మార్పిడి
### సీసీ షరాఫ్ మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్లో నిర్వహణ




హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఈవార్తలు): పేద రోగులకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా కాచిగూడలోని సీసీ షరాఫ్ మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ నిరంతరం కృషి చేస్తోందని ట్రస్టీ ఎన్.సుకుమార్, జనరల్ మేనేజ ర్లు ఏ. సోమారెడ్డి, కే.శేషాద్రి, పి. ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. మంగళవారం కాచిగూడలోని హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్స్ డాక్టర్ శశిధరన్, డాక్టర్ జి. ప్రతాప్ రెడ్డి, డాక్టర్ గోవింద్ గాంధీ లతో కలిసి వారు మాట్లాడారు. హాస్పిటల్లో మోకాలి కీలు మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకునే పేద రోగులకు నందిని రమేష్ గాంధీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.50 వేలు సబ్సిడీగా అందిస్తున్నట్లు వా రు తెలిపారు. ఇతర కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.2లక్షల వరకు అయ్యే ఖర్చును సీసీ షరాఫ్ మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్లో మోకాలి కీలు మార్పిడి శస్త్ర చికిత్సకు రూ.1,45,000 వరకు ఖర్చు అవుతుందని, అందులో ట్రస్ట్ ద్వారా రూ.50వేలు చెల్లిస్తుండటంతో ప్రత్యేక ప్యాకేజీతో రూ. 95 వేలకే మోకాలికీలు మార్పిడి శస్త్ర చికిత్స పూర్తవుతుందని తెలిపారు. ఈ శస్త్ర చికిత్స ఆరోగ్యశ్రీ పథకంలో వర్తించదని స్పష్టం చేశారు. అదేవిధంగా అన్ని ఇన్సూరెన్స్ కంపెనీల్లో ఆరోగ్య బీమా సదుపాయం ఉన్న వారు, సి.జీ.హెచ్.ఎస్ ఉద్యోగులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోగలరని తెలిపా రు. అమెరికా టెక్నాల జీతో చేయబడిన ఇంప్లాంట్ ఉపయోగిస్తూ అనుభవజ్ఞు లైన ఆర్థోపె డిక్ వైద్యులచే శస్త్ర చికిత్సలు చే యడం జరుగుతుందన్నారు. చికి త్సా విధానంలో ఏలాంటి మార్పు ఉండదని, అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో అందుతున్న మాదిరిగానే ఇక్కడ వైద్య సేవలు అందుతాయ ని వారు పేర్కొన్నారు. శస్త్ర చికిత్స అనంతరం రెండో రోజు నడిపించ డం జరుగుతుందని, మూడో రోజు డిస్ ఛార్జ్ చేస్తామని తెలిపారు. రెండు వారాల తరువాత పనులను యదావిధిగా చేసుకునే అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వాట్సాప్ నెంబర్: 799 5273377 ద్వారా సంప్రదించ వచ్చునని వారు సూచించారు.

# హైదరాబాదులో ఇద్దరు ఘరానా దొంగల అరెస్ట్

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఈవార్తలు): హైదరాబాద్ నగరం నడిబొడ్డున తీవ్ర కలకలం రేపిన కోఠి కాల్పుల దోపిడీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. జనవరి 31న ఎస్‌బీఐ ఏటీఎం వద్ద వ్యాపారిపై కాల్పులు జరిపి రూ. 6 లక్షలు దోచుకున్న అంతరాష్ట్ర ముఠాలోని ఇద్దరు సభ్యులను అరెస్ట్ చేసినట్టు టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మంగళవారం వెల్లడించారు. నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందినవారని తెలిపారు. అరెస్టయిన వారిని యూపీకి చెందిన ఫుర్ఖాన్ అహ్మద్ (36), తయ్యబ్ త్యాగి (30)గా గుర్తించారు. తయ్యబ్ త్యాగి నగరంలో క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తూ షాహీన్ నగర్‌లో నివసిస్తున్నాడు. వారి నుంచి ఒక దేశీయ తుపాకీ, 35 బుల్లెట్లు, రెండు మ్యాగజైన్లు, రూ. 2.38 లక్షల నగదు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు డీసీపీ తెలిపారు. ఈ కేసులో ఫహీమ్ అహ్మద్, నౌషాద్, అబిద్, డానిష్ త్యాగి, మహ్మద్ మత్లుబ్ అనే మరో ఐదుగురు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని చెప్పారు. క్యాబ్ డ్రైవర్ తయ్యబ్ త్యాగి ఈ దోపిడీకి ప్రధాన సూత్రధారి అని పోలీసులు తెలిపారు. తెల్లవారుజామున ట్రిప్పులకు వెళ్లినప్పుడు కోఠి, అబిడ్స్, నాంపల్లి ప్రాంతాల్లోని ఏటీఎంలలో కొందరు పెద్ద మొత్తంలో డబ్బు డిపాజిట్ చేయడాన్ని గమనించాడు. దోపిడీకి పథకం పన్ని, తన బంధువులైన నౌషాద్, డానిష్ త్యాగిలకు చెప్పాడు. వారు యూపీకి చెందిన ఫుర్ఖాన్, అబిద్, ఫహీమ్‌లను ఈ ప్లాన్‌లో చేర్చారు. జనవరి 31న ఉదయం, పథకం ప్రకారం ఫుర్ఖాన్, ఫహీమ్ కోటిలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద వేచి ఉన్నారు. వ్యాపారి లోపలికి వెళ్లగానే, వారు కూడా వెళ్లి తుపాకీతో బెదిరించి డబ్బు డిమాండ్ చేశారు. బాధితుడు ప్రతిఘటించడంతో ఫుర్ఖాన్ మొదట నేలపై, తర్వాత అతని కాలిపై కాల్పులు జరిపి, డబ్బు సంచితో పాటు అతని టూ-వీలర్‌ను తీసుకుని పరారయ్యారు. ఈ కేసును ఛేదించేందుకు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు, పక్కా సమాచారంతో మంగళవారం షాహీన్ నగర్ వద్ద ఇద్దరిని అరెస్ట్ చేశారు.



# నన్ను క్రిస్టియన్ అంటారా?
### కూటమి పెద్దలపై భూమన ఎదురుదాడి
### తన కూతురి పెళ్లి
### హిందూ పద్ధతిలో జరిగినట్లు వివరణ



తిరుపతి, ఫిబ్రవరి 24 (ఈవార్తలు): వైసీపీ నేత, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనను క్రిస్టియన్ అంటూ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొడుతూ, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల మత విశ్వాసాలపై సూటి ప్రశ్నలు సంధించారు. ఫోటోలను సాక్ష్యాలుగా చూపుతూ విమర్శనాస్త్రాలు సంధించారు. తన కుమార్తె వివాహం క్రైస్తవ మతం ప్రకారం జరిగిందని ఆరోపించడంపై భూమన తీవ్రంగా స్పందించారు. “నా కుమార్తె వివాహం తిరుచానూరు అమ్మవారి ఆశీస్సులతో 30 వేల మంది అతిథుల సమక్షంలో జరిగింది. ఆ పెళ్లికి మీ వియ్యంకుడు, నాకు ఆత్మీయుడైన బాలకృష్ణ, మీ తమ్ముడు, నా మిత్రుడైన నారా రామ్మూర్తి నాయుడు, 13 మంది హైకోర్టు న్యాయమూర్తులు హాజరయ్యారు. దేవదేవుని సాక్షిగా వేద మంత్రోచ్చారణల మధ్య హిందూ సంప్రదాయం ప్రకారమే పెళ్లి చేశానని ప్రమాణం చేస్తున్నా. శాసనసభలో నా ఫోటోను ప్రదర్శించి నన్ను క్రిస్టియన్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ఇది పచ్చి అబద్ధం” అంటూ చంద్రబాబుపై భూమన ధ్వజమెత్తారు. ఈ క్రమంలో చంద్రబాబు, లోకేశ్, పవన్‌లను లక్ష్యంగా చేసుకుని భూమన ఎదురుదాడికి దిగారు. “బైబిల్ పట్టుకుని ఉన్న ఫోటోలు మీవి కోకొల్లలుగా ఉన్నాయి. మరి మిమ్మల్ని క్రిస్టియన్ అనాలా? మీ కుమారుడు లోకేశ్ ముస్లిం వేషధారణలో వంగి వంగి దండాలు పెడుతున్న ఫోటోలు ఉన్నాయి. మరి లోకేశ్ ను ముస్లిం అనాలా? ‘లోకేశ్ సలాం భాయ్’ అనాలా? క్రిస్టియన్ యువతులతో లోకేశ్ తిరుగుతున్న ఫోటోలు చూపి ఆయన్ను క్రిస్టియన్ అనాలా?” అని భూమన ప్రశ్నించారు. అలాగే, “పవన్ కల్యాణ్ మూడో భార్య క్రిస్టియన్ కాదా? సనాతన ధర్మ పరిరక్షకుడినని చెప్పుకునే పవన్‌ను ఎందుకు క్రిస్టియన్ అనరు?” అని నిలదీశారు. టీటీడీలో కల్తీ నెయ్యి వివాదంపై కూడా భూమన స్పందించారు. చంద్రబాబు హయాంలోనే కల్తీ నెయ్యికి మూలాలు పడ్డాయని ఆరోపించారు. తాను టీటీడీ చైర్మన్‌గా నిబంధనల్ని సడలించలేదని, పైగా కఠినతరం చేశానని స్పష్టం చేశారు. “నా హయాంలో నిబంధనలు కఠినతరం చేశాకే ఏఆర్ డైరీ వంటి సంస్థలు వచ్చాయి. నిబంధనలు సులభతరం చేయడం వల్ల ఒక్క డైరీ సంస్థ అయినా ప్రయోజనం పొందిందని నిరూపించగలరా?” అని చంద్రబాబుకు సవాల్ విసిరారు. స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాల్లో భాగంగానే కొన్ని మార్పులు జరిగాయని వివరించారు. తన హయాంలో జరిగినంత హైందవ ధర్మ ప్రచారం ఏ ఒక్కరి పాలనలో జరగలేదని, ఈ విషయంపై చర్చకు సిద్ధమని భూమన సవాల్ విసిరారు.

# అవినాశ్ రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురు



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏ-7 నిందితుడిగా ఉన్న ముప్పిడి అవినాశ్ రెడ్డికి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో భారీ నిరాశ ఎదురైంది. అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ధర్మాసనం తోసిపుచ్చింది. చట్టం నుంచి తప్పించుకుని విదేశాల్లో తలదాచుకున్నా ప్రయోజనం లేదని, తక్షణమే విచారణకు సహకరించాలని కోర్టు స్పష్టం చేసింది. ఈరోజు జరిగిన విచారణలో భాగంగా సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. ముప్పిడి అవినాశ్ రెడ్డికి ముందస్తు బెయిల్ ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పడమే కాకుండా, ఈ నెల 26వ తేదీ లోపు సంబంధిత విచారణాధికారి ముందు స్వయంగా హాజరై లొంగిపోవాలని డెడ్ లైన్ విధించింది. చట్టం ముందు లొంగిపోయిన తర్వాతే నిబంధనల ప్రకారం సాధారణ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ కేసు మూలాలు అంతర్జాతీయంగా విస్తరించాయని సుప్రీంకోర్టు గతంలోనే అనుమానం వ్యక్తం చేసింది. లిక్కర్ స్కామ్ ద్వారా అక్రమంగా ఆర్జించిన కోట్లాది రూపాయలను అవినాశ్ రెడ్డి ద్వారా రాజ్ కెసిరెడ్డి విదేశాల్లో దాచారనే ఆరోపణలపై ధర్మాసనం దృష్టిసారించింది. స్కామ్ వెలుగులోకి వచ్చినప్పటి నుంచి అవినాశ్ రెడ్డి శ్రీలంకలో తలదాచుకున్నట్లు దర్యాప్తులో తేలింది. సుప్రీంకోర్టులో బెయిల్ దక్కకపోవడంతో, ఇప్పుడు అవినాశ్ రెడ్డి లొంగిపోవడం మినహా మరో మార్గం లేదు. ఆయన లొంగిపోయిన తర్వాత జరిపే విచారణలో మరికొంత మంది రాజకీయ ప్రముఖుల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.



# చైనా జే-20కి చెక్

## రష్యా మోడ్రన్ స్టెల్త్ విమానాల వైపు భారత్ చూపు

## ఐదో తరం స్టెల్త్ విమానాల కోసం భారత్ ప్రయత్నాలు

న్యూఢిల్లీ: భారత వాయుసేన (ఐఏఎఫ్) తన సామర్థ్యాన్ని మరింత పటిష్టం చేసుకునే దిశగా కీలక యోచనలు చేస్తోంది. ఇటీవలే జరిగిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత, రష్యాకు చెందిన ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ 'సుఖోయ్ ఎస్‌యూ-57' కొనుగోలుపై రక్షణ వర్గాల్లో చర్చలు మళ్లీ ఊపందుకున్నాయి. చైనా, పాకిస్థాన్ నుంచి ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఈ అత్యాధునిక యుద్ధ విమానాలను సమకూర్చుకోవాలని భారత్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఈ ఒప్పందం కార్యరూపం దాల్చితే, వాయుసేన సుమారు 40 ఎస్‌యూ-57 జెట్లను ఆర్డర్ చేసే అవకాశం ఉందని సమాచారం. గత ఏడాది పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ వాయుసేనతో జరిగిన గగనతల పోరాటాలు భారత రక్షణ వ్యూహకర్తలకు కొత్త పాఠాలు నేర్పాయి. ఆధునిక యుద్ధ తంత్రంలో ఫైటర్ జెట్లు నేరుగా తలపడే డాగ్‌ఫైట్ కన్నా, శత్రువు కంటపడకుండా దాడి చేసే స్టెల్త్ టెక్నాలజీకే ప్రాధాన్యత పెరిగిందని స్పష్టమైంది. ఈ నేపథ్యంలో, రాడార్లకు చిక్కని ఐదో తరం యుద్ధ విమానాల ఆవశ్యకతను ఐఏఎఫ్ గుర్తించింది. ఇప్పటికే చైనా జే-20 పేరుతో సొంతంగా స్టెల్త్ ఫైటర్‌ను అభివృద్ధి చేసింది. భవిష్యత్తులో ఈ టెక్నాలజీ పాకిస్థాన్‌కు కూడా అందే అవకాశం ఉందన్న ఆందోళనల నేపథ్యంలో, భారత్ వేగంగా స్పందించాల్సిన అవసరం ఏర్పడింది.

### ఎస్‌యూ-57 ప్రత్యేకతలు ఏంటి?

రష్యా అభివృద్ధి చేసిన ఎస్‌యూ-57 ఒక శక్తివంతమైన ఐదో తరం మల్టీరోల్ స్టెల్త్ ఫైటర్. శత్రు రాడార్లను ఏమార్చేలా ప్రత్యేకమైన ఎయిర్‌ఫ్రేమ్ డిజైన్, రాడార్ తరంగాలను శోషించుకునే మెటీరియల్స్‌తో దీనిని నిర్మించారు. సూపర్‌క్రూయిజ్ సామర్థ్యం (ఆఫ్టర్‌బర్నర్ అవసరం లేకుండానే సూపర్‌సానిక్ వేగంతో ప్రయాణించడం), అడ్వాన్స్‌డ్ సెన్సార్ ఫ్యూజన్ వంటి అత్యాధునిక ఫీచర్లు ఇందులో ఉన్నాయి. గగనతలం నుంచి గగనతలానికి, భూమిపైకి క్షిపణులను ప్రయోగించే సత్తా దీని సొంతం.



### మధ్యంతర పరిష్కారంగానే..

భారత్ సొంతంగా 'అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్' (ఏఎంసీఏ) పేరుతో ఐదో తరం ఫైటర్ జెట్‌ను అభివృద్ధి చేస్తోంది. అయితే దీని తొలి ప్రయోగాత్మక ఫ్లైట్ 2028-29లో జరిగి, 2035 నాటికి గానీ వాయుసేనలోకి పూర్తిస్థాయిలో చేరే అవకాశం లేదు. ఈ సుదీర్ఘ కాలంలో ఏర్పడే వ్యూహాత్మక అంతరాన్ని పూడ్చడానికే ఎస్‌యూ-57 జెట్లను ఒక 'బ్రిడ్జింగ్' పరిష్కారంగా భారత్ చూస్తోంది. గత ఏడాది జరిగిన ఏరో ఇండియా 2025లో రష్యా ఈ విమానాన్ని ప్రదర్శనకు ఉంచింది. అయితే, ప్రస్తుతానికి ఈ కొనుగోలుపై ఎలాంటి అధికారిక ఒప్పందం జరగలేదని, కేవలం చర్చల దశలోనే ఉందని రక్షణ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

# పినరయితో మోహన్‌లాల్ ఇంటర్వ్యూ

**విజయన్ వ్యక్తిగత, రాజకీయ జీవితంపై ప్రశ్నలు**

తిరువనంతపురం: సాధారణంగా సినీ ప్రముఖులను జర్నలిస్టులు, రాజకీయ నేతలు ఇంటర్వ్యూ చేస్తుంటారు. కానీ, కేరళలో దీనికి భిన్నమైన దృశ్యం ఆవిష్కృతమైంది. మలయాళ సూపర్ స్టార్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత మోహన్‌లాల్... ఏకంగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ఇంటర్వ్యూ చేశారు. ఇప్పటివరకు అనేక ఇంటర్వ్యూలలో ప్రశ్నలను ఎదుర్కొన్న మోహన్‌లాల్, ఈసారి ప్రశ్నలు అడిగే పాత్రను పోషించడం ఆసక్తి కలిగిస్తోంది. సీఎం అధికారిక నివాసమైన క్లిఫ్ హౌజ్‌లో ఈ ప్రత్యేక ముఖాముఖి జరిగింది. ఈ ప్రాజెక్ట్ కోసం మోహన్‌లాల్ రెండు రోజులు తిరువనంతపురంలో గడిపినట్లు సమాచారం. ఒక రోజు చర్చలు జరిపి, మరుసటి రోజు ఇంటర్వ్యూను చిత్రీకరించారు. ఇందులో ముఖ్యమంత్రి వ్యక్తిగత జీవితం, రాజకీయ ప్రస్థానం, ప్రభుత్వ పాలన వంటి అంశాలపై మోహన్‌లాల్ ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. ఈ ఇంటర్వ్యూ టీజర్‌ను మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. పూర్తి ఇంటర్వ్యూ త్వరలో ప్రముఖ ఛానెళ్లలో ప్రసారం కానుంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ ఇంటర్వ్యూ జరగడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది ప్రభుత్వ పబ్లిక్ రిలేషన్స్ (పీఆర్) ప్రయత్నాల్లో భాగమేనని విపక్షాలు ఇప్పటికే ఆరోపణలు గుప్పిస్తున్నాయి. అయితే, మోహన్‌లాల్ ఒక ముఖ్యమంత్రిని ఇంటర్వ్యూ చేయడం ఇదే తొలిసారి కాదు. గతంలో మాజీ సీఎం ఊమెన్ చాందీని కూడా ఆయన ఇలాగే ఇంటర్వ్యూ చేశారు. ఇప్పటికే క్లిఫ్ హౌజ్‌లో మోహన్‌లాల్, పినరయి విజయన్ కలిసి ఉన్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ముఖాముఖి రాజకీయాలను ప్రభావితం చేస్తుందో లేదో కానీ, ఒక సూపర్ స్టార్ ప్రశ్నలు అడుగుతుంటే కేరళ మొత్తం ఆసక్తిగా చూస్తుందనడంలో సందేహం లేదు.

# గుర్రంపై బ్లింకిట్ డెలివరీ

**రాజస్థాన్‌లో 'రాయల్' సర్వీస్**

భోపాల్: ఆధునిక క్విక్-కామర్స్ సేవలు, సంప్రదాయ రవాణా కలగలిసిన ఓ అరుదైన దృశ్యం రాజస్థాన్‌లో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఓ వృద్ధుడు గుర్రంపై స్వారీ చేస్తూ, వీపుపై బ్లింకిట్ డెలివరీ బ్యాగ్‌తో వెళుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎక్స్ లో పోస్ట్ అయిన ఈ వీడియోలో, సంప్రదాయ దుస్తులు, తలపాగా ధరించిన ఓ వృద్ధుడు రాజస్థాన్‌లోని ఓ రోడ్డు పక్కన గుర్రంపై వెళుతూ కనిపించాడు. ఈ దృశ్యాలు దౌసా జిల్లాలో చోటుచేసుకున్నాయి. సాధారణంగా టూ-వీలర్లపై వేగంగా డెలివరీలు చేసే బ్లింకిట్ సేవలకు భిన్నంగా ఈ 'రాయల్ డెలివరీ' అందరినీ ఆకట్టుకుంది. ఈ వీడియో లక్షలాది వ్యూస్ సంపాదించి, నెటిజన్ల నుంచి ప్రశంసలు అందుకుంది. "ఇది రాజస్థాన్ బ్రో," "పర్యావరణానికి మేలు చేసే గ్రీన్ డెలివరీ," అంటూ చాలామంది కామెంట్లు చేశారు. 'ఈ వయసులో కూడా ఆయన పనిచేస్తుండటమే గొప్ప విషయం' అని మరో యూజర్ ప్రశంసించారు. రాజస్థాన్‌లో గుర్రాలకు చారిత్రక ప్రాధాన్యం ఉన్నందున, ఈ దృశ్యం ఆ రాష్ట్ర సంస్కృతికి అద్దం పడుతోందని పలువురు అభిప్రాయపడ్డారు.

# అమెరికా సైనికులకు టాయిలెట్ల కష్టాలు

**అమెరికా అతిపెద్ద యుద్ధనౌకలో తిప్పలు**



వాషింగ్టన్: మధ్యప్రాచ్యంలో ఇరాన్‌తో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన వేళ, అమెరికా తన సైనిక శక్తిని పెద్ద ఎత్తున మోహరిస్తోంది. అయితే, ఈ కీలక సమయంలో ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత ఖరీదైన విమాన వాహక నౌక యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ ఊహించని సమస్యలతో సతమతమవుతోంది. యుద్ధ సన్నాహాల కంటే ఎక్కువగా.. నౌకలోని మరుగుదొడ్ల వ్యవస్థ విఫలమవడం సుమారు 5,000 మంది సిబ్బందికి నరకం చూపిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో, మధ్యప్రాచ్యంలో సైనిక శక్తిని ప్రదర్శించేందుకు ఈ నౌకను రంగంలోకి దించారు. గత ఏడాది జూన్‌లో సముద్రంలోకి వచ్చిన ఈ నౌక మోహరింపును ఇప్పటికే రెండుసార్లు పొడిగించారు. దీంతో సిబ్బంది దాదాపు 8 నెలలుగా సముద్రంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణంగా శాంతికాలంలో ఆరు నెలలకు మించి డెప్లాయ్‌మెంట్ (మోహరింపు) ఉండదు. ఇది మరో 11 నెలల వరకు కొనసాగితే, అమెరికా నేవీ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైన నిరంతర డెప్లాయ్‌మెంట్‌గా రికార్డు సృష్టిస్తుందని రిటైర్డ్ రియర్ అడ్మిరల్ మార్క్ మాంట్‌గోమరీ వాల్ స్ట్రీట్ జర్నల్‌కు తెలిపారు. సుమారు 13 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.1 లక్షల కోట్లు) భారీ వ్యయంతో నిర్మించిన ఈ నౌకలో ఏర్పాటు చేసిన వాక్యూమ్ ఆధారిత ప్లంబింగ్ వ్యవస్థే ప్రధాన సమస్యగా మారింది. ఇందులో దాదాపు 650 టాయిలెట్లు ఉన్నాయి. ఏదైనా ఒక టాయిలెట్‌లో సమస్య వస్తే, ఆ సెక్షన్‌లోని అన్ని టాయిలెట్లు పనిచేయకుండా పోతున్నాయి. టీ-షర్టులు, తాళ్లు వంటి వస్తువులు పైపుల్లో ఇరుక్కుపోవడం, కొన్నిసార్లు టాయిలెట్ విడిభాగాలు ఊడిపోవడం వంటి కారణాలతో ఈ వ్యవస్థ తరచూ మొరాయిస్తోంది. జనవరిలో ఎన్‌పీఆర్ రిపోర్ట్ ప్రకారం, ఈ సమస్యలు మరింత తీవ్రమయ్యాయని తెలుస్తోంది. ఈ సాంకేతిక సమస్యల పరిష్కారానికి నావికా సిబ్బంది రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. లీక్‌లను అరికట్టేందుకు కొందరు సిబ్బంది రోజుకు 19 గంటల వరకు పనిచేస్తున్నట్లు సమాచారం. డెప్లాయ్‌మెంట్ గడువును పదేపదే పొడిగించడంతో సిబ్బంది శారీరకంగా, మానసికంగా తీవ్ర అలసటకు గురవుతున్నారు. నెలల తరబడి కుటుంబాలకు దూరంగా ఉండటం వారిని మరింత కుంగదీస్తోంది. నౌక కదలికలను రహస్యంగా ఉంచే 'ఘోస్ట్ మోడ్' కారణంగా బయటి ప్రపంచంతో సంప్రదింపులు కూడా పరిమితమయ్యాయి. ఈ ఒత్తిడితో విసిగిపోయిన కొందరు నావికులు, ఈ డ్యూటీ ముగిసిన వెంటనే నేవీని విడిచిపెట్టాలని భావిస్తున్నట్లు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌తో పాటు జెరాల్డ్ ఫోర్డ్ కూడా చేరడంతో రెండు విమాన వాహక నౌకలు మోహరించినట్లు అయింది. ఈ అంతర్గత సమస్యలు సిబ్బంది నైతిక స్థైర్యంపై ప్రభావం చూపుతున్నప్పటికీ, నౌక యుద్ధ సామర్థ్యంపై ఎలాంటి ప్రభావం లేదని అధికారులు చెబుతున్నారు.

# చెల్లికి ప్రమోషన్.. కూతురుకు వారసత్వం

**కిమ్ కుటుంబంలో కీలక పరిణామాలు**



ప్యాంగ్యాంగ్: ఉత్తర కొరియాలో అప్రతిహత అధికారాన్ని చెలాయిస్తున్న కిమ్ కుటుంబం, దేశంపై తన పట్టును మరింత పటిష్టం చేసుకుంటోంది. అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ సోదరి కిమ్ యో జోంగ్‌కు కీలక పదోన్నతి లభించడమే ఇందుకు నిదర్శనం. దేశ భవిష్యత్ విధానాలను నిర్దేశించేందుకు జరుగుతున్న వర్కర్స్ పార్టీ కాంగ్రెస్ సమావేశాల వేదికగా ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ పరిణామం కిమ్ కుటుంబ పాలన మరింత బలపడుతోందన్న సంకేతాలను స్పష్టంగా పంపుతోంది. అధికారిక కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ) నివేదిక ప్రకారం ఇప్పటివరకు వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా సెంట్రల్ కమిటీలో వైస్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్న కిమ్ యో జోంగ్‌ను ఇప్పుడు ఓ డిపార్ట్‌మెంట్‌కు డైరెక్టర్‌గా నియమించారు. అయితే, ఆమెకు ఏ విభాగాన్ని కేటాయించారనే దానిపై స్పష్టత రాలేదు. ఐదేళ్ల తర్వాత జరుగుతున్న ఈ పార్టీ కాంగ్రెస్ సమావేశాల్లో కిమ్ జోంగ్ ఉన్ పార్టీ జనరల్ సెక్రటరీగా తిరిగి ఎన్నికయ్యారు. మరోవైపు కిమ్ జోంగ్ ఉన్ తర్వాత ఆయన వారసురాలిగా టీనేజ్ కుమార్తె కిమ్ జు ఏను సిద్ధం చేస్తున్నట్లు కనిపిస్తోందని దక్షిణ కొరియా గూఢచార సంస్థ ఇటీవల అంచనా వేసింది. ఇది నిజమైతే 1940ల నుంచి కొనసాగుతున్న కిమ్ కుటుంబ పాలన భవిష్యత్తులోనూ కొనసాగనుంది. కిమ్ కుటుంబంలో ఇతర సభ్యుల జీవితాలు విషాదాంతమైన నేపథ్యంలో కిమ్ యో జోంగ్ ఉన్నత స్థానానికి చేరుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. కిమ్ జోంగ్ ఉన్ తన సోదరుడు, రాజకీయ ప్రత్యర్థి అయిన కిమ్ జోంగ్ నామ్‌ను 2017లో హత్య చేయించారని బలమైన ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం పార్టీ కాంగ్రెస్ సమావేశాల్లో దేశ దీర్ఘకాలిక లక్ష్యాలపై చర్చిస్తున్నట్లు కేసీఎన్ఏ తెలిపింది. అయితే, అమెరికాతో విధానం, అణ్వస్త్ర ప్రణాళికలపై కిమ్ జోంగ్ ఉన్ ఇంకా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. దేశ అణు యుద్ధ నిరోధక సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే ప్రణాళికలను ఈ సమావేశంలో స్పష్టం చేస్తానని ఆయన గత నెలలో ప్రకటించిన విషయం తెలిసిందే.


# నేపాల్‌లో అడవి పందుల గోల

**విపత్తుగా ప్రకటించిన ఆ దేశ ప్రభుత్వం**

**వాటిని చంపినా పర్లేదని సూచనలు**



ఖట్మండు: నేపాల్ ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో పంటలను తీవ్రంగా నష్టం చేస్తున్న అడవి పందుల విషయంలో రైతులకు పూర్తి స్వేచ్ఛనిచ్చింది. పొలాల్లోకి వచ్చి నష్టం కలిగిస్తే వాటిని తరిమికొట్టడం, బంధించడం లేదా చంపేయడానికి కూడా అనుమతి ఇస్తూ అధికారిక గెజిట్‌లో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ఏడాది పాటు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. సుమారు రెండు వారాల క్రితం కోతుల విషయంలోనూ ఇలాంటి ప్రకటనే చేసిన నేపాల్ ప్రభుత్వం, ఇప్పుడు అడవి పందులను కూడా 'వ్యవసాయానికి నష్టం కలిగించే జంతువుల' జాబితాలో చేర్చింది. వన్యప్రాణుల వల్ల రైతులు భారీగా పంట నష్టపోతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ తెలిపింది. సాగు భూములు తగ్గిపోవడం, అటవీ ప్రాంతం విస్తరించడంతో వన్యప్రాణులకు, మానవులకు మధ్య ఘర్షణ పెరుగుతోంది. దీనివల్ల చాలాచోట్ల పొలాలు బీడుగా మారుతున్నాయి, ఉత్పత్తి పడిపోతోంది. కొన్నిసార్లు ఈ జంతువులు మనుషులపై దాడి చేసి ప్రాణాలు తీసిన సందర్భాలూ ఉన్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, రైతులు ఒక్కరుగా గానీ, అందరూ కలిసి గానీ పంటలకు నష్టం చేసే అడవి పందులను తరిమికొట్టవచ్చు లేదా బంధించవచ్చు. ఒకవేళ బంధిస్తే, దగ్గర్లోని అటవీ శాఖ కార్యాలయానికి అప్పగించి, స్థానిక వార్డు కార్యాలయానికి సమాచారం ఇవ్వాలి. ఒకవేళ వాటిని తరిమే క్రమంలో అడవి పంది చనిపోతే, స్థానిక ప్రభుత్వ ప్రతినిధి, ఐదుగురు స్థానిక సాక్షుల సమక్షంలో దాన్ని ఖననం చేయాలి. ఈ విషయాన్ని కూడా అధికారులకు తెలియజేయాలి. అయితే, ఈ నిబంధనలు జాతీయ పార్కులు, వన్యప్రాణుల అభయారణ్యాలు, రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో వర్తించవని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రైవేట్ వ్యవసాయ భూములు, పంట కల్లాలు, పెరటి తోటల్లోకి వచ్చే అడవి పందులకు మాత్రమే ఈ నిబంధనలు వర్తిస్తాయి.



# భారత్‌పై జాత్యహంకార విద్వేషం


**విషం కక్కిన ఆస్ట్రేలియా అతివాది**

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాకు చెందిన నయా నాజీ ఉద్యమకారుడు, జాత్యహంకార సిద్ధాంతకర్త థామస్ సెవెల్ భారత్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో పెను దుమారం రేపుతున్నాయి. తనపై ఉన్న పలు క్రిమినల్ కేసుల విచారణ నిమిత్తం మెల్‌బోర్న్ కోర్టుకు హాజరైన అతడు, వెలుపల మీడియాతో మాట్లాడుతూ అత్యంత హేయమైన రీతిలో భారతీయులను, భారతీయ సంస్కృతిని అవమానించాడు. "భారత్ లాంటి మూడో ప్రపంచ దేశంగా ఆస్ట్రేలియా మారడం మాకు ఇష్టం లేదు" అంటూ అతడు చేసిన వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయి. 'శ్వేత జాతీయుల స్థానభ్రంశం' పేరిట విద్వేష ప్రచారం చేసే 32 ఏళ్ల థామస్ సెవెల్... ప్రస్తుతం ఆస్ట్రేలియాలో రద్దయిన 'నేషనల్ సోషలిస్ట్ నెట్‌వర్క్' అనే అతివాద గ్రూపుకు నాయకత్వం వహించేవాడు. కోర్టు వెలుపల 7న్యూస్ రిపోర్టర్‌తో వాగ్వివాదానికి దిగిన అతడు, ఆస్ట్రేలియాలో శ్వేత జాతీయుల సంఖ్య తగ్గిపోతోందని, భారతీయ వలసదారుల వల్ల దేశం తన ఉనికిని కోల్పోతోందని ఆరోపించాడు. "మేము భారత్‌లా, సుడాన్‌లా మారకూడదు.. ఆస్ట్రేలియా ఆస్ట్రేలియాగానే ఉండాలి" అంటూ విద్వేషపూరిత 'వైట్ రీప్లేస్‌మెంట్' సిద్ధాంతం గురించి మాట్లాడాడు. ఇదంతా ఒక కార్పొరేట్ కుట్ర అని, ఆస్ట్రేలియా మీడియా ఈ వాస్తవాలను దాచిపెడుతోందని అతడు రిపోర్టర్‌ను సైతం దూషించాడు. థామస్ సెవెల్ పై 25 క్రిమినల్ కేసులు ఉన్నాయి. 2025 ఆగస్టులో మెల్‌బోర్న్‌లోని ఆదివాసీల పవిత్ర స్థలమైన 'క్యాంప్ సావర్నిటీ'పై తన అనుచరులతో కలిసి దాడి చేశాడన్న ఆరోపణలతో సహా మొత్తం 25 క్రిమినల్ కేసులను అతడు ఎదుర్కొంటున్నాడు. ఆ దాడిలో ఒక వ్యక్తిని పిడికిలితో కొట్టడం, మరొకరిని తన్నడం వంటి దుశ్చర్యలకు పాల్పడినట్లు కోర్టులో విచారణ జరుగుతోంది. అంతేకాకుండా, గతంలో మెల్‌బోర్న్ వీధుల్లో "తెల్లజాతి మనిషి తిరగబడాలి" అనే బ్యానర్లతో ప్రదర్శన చేస్తూ సామాన్యులపై దాడికి దిగిన చరిత్ర కూడా ఇతడికి ఉంది. మరోవైపు, ఆస్ట్రేలియా ప్రభుత్వం ఇటువంటి అతివాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని, జాత్యహంకారానికి తావులేకుండా చూడాలని భారతీయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# అమెరికా ఒత్తిడికి ప్రధాని తలొగ్గారు: రాహుల్



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం కోసం ప్రధాని మోదీ దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని, అమెరికా ఒత్తిడికి పూర్తిగా లొంగిపోయారని ఆయన ఆరోపించారు. మంగళవారం భోపాల్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'మహా కిసాన్ సమ్మేళన్'లో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం, రాబోయే ఐదేళ్లలో భారత్ అమెరికా నుంచి రూ.9 లక్షల కోట్ల విలువైన వస్తువులను కొనుగోలు చేయాల్సి ఉంటుందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దీనివల్ల దేశీయ పరిశ్రమలు, ముఖ్యంగా వ్యవసాయ, టెక్స్‌టైల్ రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "టెక్స్‌టైల్ రంగాన్ని ఇప్పటికే నాశనం చేశారు. బంగ్లాదేశ్‌కు సున్నా శాతం సుంకాలు ఇచ్చిన అమెరికా, తమ నుంచి పత్తి కొనాలంటూ భారత్‌పై ఒత్తిడి తెస్తోంది" అని రాహుల్ విమర్శించారు. "తన రాజకీయ భవిష్యత్తును, వ్యక్తిగత ఇమేజ్‌ను కాపాడుకోవడానికే నరేంద్ర మోదీజీ ఒత్తిడికి తలొగ్గారు" అని రాహుల్ ఆరోపించారు. ఈ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని ఆయన ప్రధానిని డిమాండ్ చేశారు. ఈ ఒప్పందానికి సంబంధించి ఈమెయిళ్లు, వీడియోలతో సహా కీలక ఆధారాలు తన వద్ద ఉన్నాయని, వాటిని ఇంకా బయటపెట్టలేదని ఆయన తెలిపారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా తలపెట్టిన కిసాన్ సమ్మేళనాలకు ఈ సభతో శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా పాల్గొన్నారు. ఈ ఒప్పందం వల్ల పత్తి, సోయాబీన్, మొక్కజొన్న వంటి పంటలకు ప్రమాదం వాటిల్లుతుందని, రైతుల జీవనోపాధి దెబ్బతింటుందని కాంగ్రెస్ నేతలు వాదిస్తున్నారు. మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లో త్వరలో ఇలాంటి సభలు నిర్వహించనున్నారు.



# కుప్పకూలిన సెన్సెక్స్

**మార్కెట్లపై ట్రంప్ దెబ్బ**

ముంబై: అమెరికా వాణిజ్య విధానాలపై తాజాగా తలెత్తిన ఆందోళనలతో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలను చవిచూశాయి. గత నాలుగు రోజుల్లో ఎన్నడూ లేనంతగా అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు కుప్పకూలాయి. బ్యాంకింగ్, ఇన్‌ఫ్రా, ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాలు జరగడంతో సెన్సెక్స్ 1,068.74 పాయింట్లు నష్టపోయి 82,225.92 వద్ద ముగిసింది. నిఫ్టీ 288.35 పాయింట్లు తగ్గి 25,424.65 వద్ద స్థిరపడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్తగా 15 శాతం తాత్కాలిక టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరించడంతో ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య ఉద్రిక్తతలు మళ్లీ రాజుకుంటాయన్న భయాలు మొదలయ్యాయి. గతంలో ఆయన విధించిన టారిఫ్‌లు చట్టవిరుద్ధమని అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ, ట్రంప్ తాజా హెచ్చరికలు చేయడంతో అంతర్జాతీయ మార్కెట్ల సెంటిమెంట్ దెబ్బతింది. దీని ప్రభావం భారత మార్కెట్లపై కూడా ప్రతికూలంగా పడింది. ఈ అమ్మకాల ఒత్తిడిలో ఐటీ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. అమెరికా టెక్నాలజీ వ్యయంపై ఆందోళనలు, బలహీనమైన గ్లోబల్ సంకేతాలతో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 4.74 శాతం పతనమై 30,053.50 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సమయంలో ఈ సూచీ రెండేళ్ల కనిష్ఠ స్థాయిని కూడా తాకింది. ఐటీ తర్వాత రియాల్టీ రంగం 2.54 శాతం నష్టపోయింది. అయితే, మెటల్ ఇండెక్స్ మాత్రం మార్కెట్ పతనంలోనూ కాస్త మెరుగ్గా నిలిచింది. విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి 25,500--25,600 స్థాయి కీలక నిరోధకంగా ఉంది. దీనిపైన నిలదొక్కుకుంటేనే మార్కెట్ పుంజుకునే అవకాశం ఉంటుంది. ఒకవేళ 25,300 స్థాయికి దిగువకు పడిపోతే, అమ్మకాల ఒత్తిడి మరింత పెరగవచ్చని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, ఏఐ టెక్నాలజీపై ఆందోళనల కారణంగా మార్కెట్లు సమీప భవిష్యత్తులో అస్థిరంగానే కొనసాగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## వయ్యారి చిత్రం



కేట్ శర్మ

# ది కేరళ స్టోరీ 2కు కేరళ హైకోర్టు షాక్!




ఆదాశర్మ ప్రధాన పాత్రలో సుదీప్తో సేన్ రూపొందించిన క్రైమ్ డ్రామా 'ది కేరళ స్టోరీ'. విపుల్ అమృత్ లాల్ షా నిర్మించారు. 2023లో విడుదలైన ఈ సినిమా అనేక వివాదాలకు తెరలేపింది. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టి ట్రేడ్ వర్గాలని విస్మయానికి గురి చేసింది. దాదాపు రెండేళ్ల విరామం తరువాత దీనికి సీక్వెల్‌గా 'ది కేరళ స్టోరీ 2'ని దర్శకుడు కామాఖ్య నారాయణ్ సింగ్ రూపొందించారు. విపుల్ అమృత్ లాల్ షా నిర్మించిన ఈ మూవీ ఫిబ్రవరి 27న ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో రిలీజ్‌కు సిద్ధమవుతోంది. టీజర్ రిలీజ్ తరువాత వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారడంతో మత విద్వేషాలని రెచ్చగొట్టే విధంగా సినిమా ఉందని కేరళ హైకోర్టులో ఓ పిటీషన్ దాఖలైంది. దీనిపై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. కేరళలో ప్రజలందరూ సామరస్యంతో జీవిస్తున్నారని, అయితే ఈ సినిమా కేరళను తప్పుగా చూపించేలా ఉందని అభిప్రాయ పడింది. ఈ సినిమాలోని కొన్ని డైలాగులని పరిశీలించిన న్యాయమూర్తి కేరళ పేరుని టైటిల్‌లో ఉపయోగించడం ద్వారా రాష్ట్రంపై తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశం ఉందని, ఇది మతపరమైన ఉద్రిక్తతలకు దారి తీయవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. సినిమా సెన్సార్ సర్టిఫికెట్‌ని సవాల్ చేస్తూ దాఖలైన పిటీషన్‌పై నిర్ణయం తీసుకునే ముందు కోర్టులో ఫిబ్రవరి 25న సినిమాని ప్రదర్శించాలని, ఆ తరువాతే సెన్సార్ విషయంలో నిర్ణయం తీసుకోగలమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీజర్‌ని కూడా సెన్సార్ లేకుండా రిలీజ్ చేశారని పిటీషనర్ వాదించడంతో టీజర్‌ని వెనక్కి తీసుకుంటామని మేకర్స్ కేరళ హైకోర్టుకు స్పష్టం చేశారు. అంతే కాకుండా కోర్టు ఈ సినిమాపై పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. సినిమా వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందించామని చెబుతున్నందున కేరళ ప్రజల భాయాందోళనలను విస్మరించలేమని ఈ సందర్భంగా న్యాయస్థానం స్పష్టం చేసింది. సినిమా టైటిల్‌లో కేరళ పేరు ఉన్నప్పటికీ చిత్రంలో ఇతర రాష్ట్రాల కథలు కూడా ఉన్నాయని, ఇది ఒక ప్రాంతాన్ని కించపరిచేదిలా ఉందని పిటీషనర్ వాదించారు. సినిమాని చూసిన తరువాతే తుది నిర్ణయం తీసుకుంటామని కోర్టు స్పష్టం చేసింది.

# విరోష్.. ఒకే రోజు 2సార్లు పెళ్లి

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తమకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకున్న విజయ్ దేవరకొండ – రష్మిక మందన్న ఎట్టకేలకు ఫిబ్రవరి 26వ తేదీన వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారు. ఇప్పటికే ఉదయపూర్ లో పెళ్లి పనులు మొదలయ్యాయి. వేదికకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న దగ్గరుండి మరీ చూసుకుంటున్న విషయం తెలిసిందే. ఇకపోతే వీరిద్దరూ వివాహం చేసుకోబోతున్న నేపథ్యంలో ఎన్నో విషయాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. అందులో భాగంగానే వీరిద్దరూ ఒకే రోజు రెండుసార్లు పెళ్లి చేసుకోబోతున్నారు. ఫిబ్రవరి 26వ తేదీన రాజస్థాన్ లో ఉదయపూర్ లోని ప్యాలెస్ లో జరిగే ఈ వివాహ వేడుక రెండు పద్ధతుల్లో జరగబోతోంది. ఉదయం విజయ్ దేవరకొండ – రష్మికలు (తెలుగు) హిందూ సాంప్రదాయం ప్రకారం వివాహ బంధంలోకి అడుగు పెడుతుండగా.. సాయంత్రం రష్మిక మందన్న మత ఆచారాల ప్రకారం కర్ణాటక (కొడువ) పద్ధతిలో వివాహం చేసుకోబోతున్నారు. అలా ఈ ఇద్దరు తమ మత ఆచారాల ప్రకారం రెండు పద్ధతుల్లో ఒకేరోజు వివాహం చేసుకోబోతున్నారు. కాగా, మార్చి 3వ తేదీన హైదరాబాద్ వేదికగా తాజ్ కృష్ణ హోటల్లో వీరిద్దరూ రిసెప్షన్ జరుపుకోనున్నారు.




## విరోష్ ప్రీమియర్ లీగ్..!





టాలీవుడ్ మోస్ట్ ఫేవరెట్ జోడీ విజయ్ దేవరకొండ – రష్మిక మందన్నల పెళ్లిపై ఎట్టకేలకు సస్పెన్స్ వీడింది. గత కొన్నేళ్లుగా వస్తున్న పుకార్లకు చెక్ పెడుతూ, విజయ్ , రష్మిక తమ వివాహాన్ని అఫీషియల్‌గా కన్ఫర్మ్ చేశారు. అభిమానులు ఎంతో ప్రేమగా పిలుచుకునే 'విరోష్' పేరును తమ వెడ్డింగ్ థీమ్‌గా మార్చేసి ఫ్యాన్స్‌కు అదిరిపోయే సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఈ జంట పెళ్లి పీటలు ఎక్కబోతున్నారనే వార్తతో సోషల్ మీడియాలో ఇప్పుడు 'విరోష్' నామజపం వినిపిస్తోంది. విజయ్ దేవరకొండ , రష్మిక తమా ఇన్‌స్టాగ్రామ్ అధికారిక ఖాతాల ద్వారా అభిమానుల పట్ల తమకున్న ప్రేమనంతటినీ చాటుకున్నారు.

# ఆయా షేర్.. సాంగ్ కేక



నేచురల్ స్టార్ నాని హీరోగా యంగ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్ ది ప్యారడైజ్ నుంచి ఫస్ట్ సింగిల్ విడుదలై ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మంగళవారం నాని పుట్టిన రోజు సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన ఆయా షేర్ సాంగ్.. అభిమానుల్లో జోష్ నింపుతోంది. దసరా వంటి బ్లాక్ బస్టర్ మూవీ తర్వాత నాని– శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ లో వస్తున్న ఆ చిత్రం ఇప్పటికే భారీ అంచనాలు క్రియేట్ చేసుకుంది. ఆ అంచనాలకు తగ్గట్టుగానే తాజాగా విడుదలైన ఆయా షేర్.. సాంగ్ మాస్, ఎనర్జీ, రగ్డ్ ఫీల్ తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాటకు రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ ఇచ్చిన మ్యూజిక్.. హై వోల్టేజ్ ఫీల్ ను తీసుకొచ్చింది. ట్రైబల్ బీట్స్ తో పాటు ఎలక్ట్రానిక్ సౌండ్స్ తో రూపొందిన ప్యారడైజ్ ఫస్ట్ ట్రాక్.. సినీ ప్రియులతోపాటు అభిమానులను తెగ మెప్పిస్తోంది. కాసర్ల శ్యామ్ లిరిక్స్ కు అడ్డుల జంగిరెడ్డి, ఆకునూరి దేవయ్య తమ గాత్రంతో ప్రాణం పోయగా, అనిరుధ్ కూడా ఆలపించడం ప్రత్యేకత. వందలాది డ్యాన్సర్ల మధ్య నాని వేసిన స్టెప్పులు సాంగ్ కు మరింత గ్రాండ్ నెస్ తెచ్చాయి. ఆ పాటను భారీ సెటప్ తో రామోజీ ఫిల్మ్ సిటీలో చిత్రీకరించినట్టు చిత్రబృందం తెలిపింది. అయితే లాంగ్ బ్రైడ్స్, గడ్డం, రఫ్ లుక్, రెడ్ బ్లేజర్ లో నాని కనిపించిన తీరు అభిమానులను ఆకట్టుకుంటోంది. సినిమాలో ఆయన పూర్తిగా మాసీ అవతార్‌లో కనిపించనున్నారని సమాచారం. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తన విజన్ తో ఒక రా, ఇంటెన్స్ వరల్డ్ ను సిల్వర్ స్క్రీన్ పై

# కయాదు లోహార్.. తగ్గేదేలే!



శ్రీ విష్ణు హీరోగా నటించిన అల్లూరి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కయాదు, ఆ సినిమాతో పెద్దగా గుర్తింపు అందుకోలేదు. కానీ తర్వాత ప్రదీప్ రంగనాథన్ తో చేసిన డ్రాగన్ మూవీ తో అమ్మడికి ప్రేక్షకుల్లో భారీ గుర్తింపు లభించింది. ఆ సినిమా తర్వాత కయాదుకి వరుసగా ఆఫర్లు వచ్చాయి. కానీ ఆమె మాత్రం చాలా సెలెక్టివ్ గా సినిమాలను ఎంపిక చేసుకుంది. డ్రాగన్ తర్వాత మరీ ముఖ్యంగా యూత్ లో ఆమెకు ఏర్పడిన క్రేజ్, సోషల్ మీడియాలో పెరిగిన ఫ్యాన్ బేస్ నిర్మాతల దృష్టిని ఆకర్షించింది. ఈ నేపథ్యంలోనే కయాదుకి మంచి ఆఫర్లు వస్తున్నాయి. రీసెంట్ గా రిలీజైన ఫంకీ సినిమాలో నటించిన కయాదు, ఆ సినిమాతో నిరాశపరిచినప్పటికీ, తనకు ఆఫర్లు ఏ మాత్రం తగ్గడం లేదని తెలుస్తోంది. కయాదు తాజాగా రెండు కొత్త తెలుగు ప్రాజెక్టులకు సైన్ చేసినట్టు సమాచారం. ఈ రెండు సినిమాల కోసం ఒక్కో సినిమాకు అమ్మడు రూ. 1 కోటి వరకు రెమ్యూనరేషన్ అందుకుంటుందని టాలీవుడ్ సర్కిల్స్ లో టాక్ వినిపిస్తోంది. కయాదు లాంటి క్రేజ్ ఉన్న హీరోయిన్లకు మామూలుగా రూ.1 కోటి రెమ్యూనరేషన్ అంటే ఓకే కానీ, ఫ్లాప్ తర్వాత కూడా అమ్మడు అదే రెమ్యూనరేషన్ ను

# కంపెనీ డైరెక్టర్‌గా దీక్షాసేత్

అల్లు అర్జున్, క్రిష్ కాంబోలో వచ్చిన 'వేదం' సినిమాతో నటిగా తెలుగు ప్రేక్షకులకు దీక్షా సేథ్ పరిచయం అయిన విషయం తెల్సిందే. హీరోయిన్‌గా దీక్షాకి టాలీవుడ్‌లో మంచి లైఫ్ ఉంటుందని అంతా అనుకున్నారు. వేదం సినిమాలో పూజ పాత్రలో కనిపించిన దీక్షా సేథ్ మొదటి సినిమాతోనే ఆకట్టుకుంది. పైగా వేదం సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో చాలా తక్కువ సమయంలోనే ఎక్కువ సినిమా ఆఫర్లు వచ్చాయి. 2010లో 'వేదం' సినిమాతో వచ్చిన దీక్షా సేత్ 2011లో మిరపకాయ్, వాంటెడ్ సినిమాలతో వచ్చింది. అదే ఏడాది ఒక తమిళ సినిమాలోనూ విక్రమ్‌కి జోడీగా నటించే అవకాశం దక్కించుకుంది. ఆ సమయంలో ఆమె జోరు చూస్తే దీక్షా టాలీవుడ్ టాప్ స్టార్ హీరోయిన్‌గా మారడం ఖాయం అనుకున్నారు. కానీ ఆమెకి లక్ కలిసి రాలేదు. చేసిన సినిమాల్లో ఎక్కువ శాతం బాక్సాఫీస్ వద్ద నిరాశను మిగిల్చాయి. తెలుగులో దీక్షా సేథ్ నటించిన సినిమాల్లో వేదం, మిరపకాయ్ సినిమాలు మినహా మరే సినిమాలు హిట్ కాలేదు. పైగా ఇతర భాషల్లో నటించిన సినిమాలు కూడా ఈమెకి బ్రేక్ తెచ్చి పెట్టలేదు. అందంతో పాటు కొంత అదృష్టం కూడా ఉండాలని ఈ అమ్మడి విషయంలో చాలా మంది ఒప్పుకుంటారు. నటనతో మెప్పించలేక పోయిన అందంతో ఆకట్టుకున్న హీరోయిన్స్ ఇండస్ట్రీలో చాలా మంది ఉన్నారు. కానీ దీక్షా సేత్ అందం ఉన్నా అదృష్టం కలిసి రాకపోవడంతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన కొన్నాళ్లకే దూరం కావాల్సి వచ్చింది. అయితే, ఈమె ఒక యూకే బేస్డ్ గేమింగ్ కంపెనీకి డైరెక్టర్‌గా నియమితురాలైంది. బిజినెస్ మేనేజ్‌మెంట్ లో పట్టా పొందిన దీక్షాసేత్‌కు ఆ ప్రముఖ గేమింగ్ కంపెనీ ఈ ఆఫర్ ను ఇచ్చిందని సమాచారం.



# 183 పరుగుల తేడాతో గెలవాలి!

**భారీ నెట్ రన్‌రేట్ తప్పనిసరి**

**జింబాబ్వేను చిత్తు చేస్తేనే సెమీస్ ఆశలు**

టీ20 ప్రపంచ కప్ 2026లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ పరిస్థితి అత్యంత క్లిష్టంగా మారింది. సూపర్-8 మొదటి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో 76 పరుగుల భారీ తేడాతో ఓడిపోవడం వల్ల భారత నెట్ రన్ రేట్ బాగా పడిపోయింది. ఈ నేపథ్యంలో టీమిండియా సెమీఫైనల్ అవకాశాలపై మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ తన యూట్యూబ్ ఛానెల్లో కీలక కామెంట్స్ చేశారు. మరోవైపు జింబాబ్వేపై వెస్టిండీస్ 107 పరుగుల భారీ తేడాతో విజయం సాధించడం భారత్ కొంపముంచింది. విండీస్ సాధించిన ఈ భారీ విజయంతో వారి రన్ రేట్ ఆకాశాన్ని తాకింది. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా సెమీస్ చేరాలంటే ఇప్పుడు అద్భుతమే జరగాలని హర్భజన్ పేర్కొన్నారు. ఒకవేళ వెస్టిండీస్ తన తర్వాతి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను ఓడిస్తే.. భారత్ తన రన్ రేట్‌ను



సరిచేసుకోవడానికి జింబాబ్వేపై కనీసం 183 పరుగుల తేడాతో గెలవాల్సి ఉంటుందని ఆయన లెక్కలు వేశారు. హర్భజన్ సింగ్ విశ్లేషణ ప్రకారం భారత్ సెమీస్ చేరాలంటే ఈ సమీకరణాలు జరగాలి. దక్షిణాఫ్రికా తన తర్వాతి రెండు మ్యాచ్‌ల్లోనూ (వెస్టిండీస్, జింబాబ్వేపై) విజయం సాధించాలి. అదే సమయంలో టీమిండియా తన మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ తప్పనిసరిగా గెలవాలి. వెస్టిండీస్ జట్టు దక్షిణాఫ్రికా చేతిలో ఓడిపోవాలని భారత్ కోరుకోవాలి. ఒకవేళ వెస్టిండీస్ గెలిస్తే.. మూడు జట్లు 4 పాయింట్లతో సమానంగా ఉంటాయి. అప్పుడు రన్ రేట్ కీలకం అవుతుంది, అందులో భారత్ (-3.80) చాలా వెనుకబడి ఉంది.

# బ్రూక్ ఊచకోత

## పాకిస్థాన్ చిత్తు

## ఇంగ్లండ్ ఘన విజయం



**టీ20 ప్రపంచకప్ 2026లో ఇంగ్లండ్ జట్టు మరోసారి సత్తా చాటింది. పల్లెకెలె వేదికగా జరిగిన సూపర్-8 పోరులో పాకిస్థాన్‌ను 2 వికెట్ల తేడాతో చిత్తు చేసి, ఈ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకున్న మొట్టమొదటి జట్టుగా అవతరించింది. ఒకానొక దశలో ఓటమి అంచున నిలిచినప్పటికీ.. కెప్టెన్ హ్యారీ బ్రూక్ అసాధారణ ఇన్నింగ్స్‌తో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు.**

**ఇంగ్లండ్ జట్టు వరుసగా ఐదోసారి టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్‌కు అర్హత సాధించి తమ ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్థాన్ జట్టుకు ఆరంభంలోనే గట్టి షాకులు తగిలాయి. ఓపెనర్ సైమ్ అయూబ్ (7), కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా (5) తక్కువ పరుగులకే వెనుదిరగడంతో జట్టు కష్టాల్లో పడింది.**

స్టార్ బ్యాటర్ బాబర్ ఆజం 24 బంతుల్లో 25 పరుగులు చేసి క్రీజులో పాతుకుపోయినట్లు కనిపించినా.. వేగంగా ఆడలేక వికెట్ పారేసుకున్నాడు. ఈ దశలో సాహిబ్జాదా ఫర్హాన్ (45 బంతుల్లో 63) బాధ్యతాయుతమైన హాఫ్ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. చివర్లో షాదాబ్ ఖాన్ (11 బంతుల్లో 23) మెరుపులు మెరిపించడంతో పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేయగలిగింది. ఇంగ్లండ్ బౌలర్లలో లియామ్ డాసన్ 3 వికెట్లతో పాక్ నడ్డి విరవగా.. ఆర్చర్, ఓవర్టన్ చెరో రెండు వికెట్లు తీశారు. 165 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్‌కు పాక్ పేసర్ షాహీన్ అఫ్రిది చుక్కలు చూపించాడు. కేవలం 5 ఓవర్లకే 3 వికెట్లు కోల్పోయి ఇంగ్లండ్ పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే వన్ డౌన్ లో వచ్చిన కెప్టెన్ హ్యారీ బ్రూక్ విశ్వరూపం ప్రదర్శించాడు. పాక్ బౌలర్లను ఫోర్లు, సిక్సర్లతో ఊచకోత కోస్తూ కేవలం 50 బంతుల్లోనే శతకాన్ని పూర్తి చేశాడు. టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఇది మూడో అత్యంత వేగవంతమైన సెంచరీ కావడం విశేషం. బ్రూక్ ఇన్నింగ్స్ ధాటికి పాక్ బౌలర్ల వ్యూహాలన్నీ తలకిందులయ్యాయి. ఒకవైపు బ్రూక్ సెంచరీతో ఇంగ్లండ్ విజయం ఖాయమనుకున్న సమయంలో, షాహీన్ అఫ్రిది మళ్లీ పుంజుకుని వరుస వికెట్లు తీశాడు. దీంతో స్కోరు 161/8 వద్దకు చేరి మ్యాచ్ ఉత్కంఠగా మారింది. అయితే చివరి ఓవర్ తొలి బంతికే జోఫ్రా ఆర్చర్ బౌండరీ బాది ఇంగ్లండ్‌ను విజయతీరాలకు చేర్చాడు. ఈ ఓటమితో పాకిస్థాన్ సెమీస్ ఆశలు దాదాపు గల్లంతయ్యాయి. సూపర్-8 లో ఆడిన రెండు మ్యాచ్‌లలో ఆ జట్టుకు ఆశించిన ఫలితాలు రాకపోవడం, బాబర్ ఆజం స్ట్రైక్ రేట్ మళ్లీ వివాదాస్పదమవ్వడం పాక్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.

### టీ20ల్లో టెస్ట్ ఆట

పాకిస్థాన్ స్టార్ క్రికెటర్ బాబర్ ఆజం మరోసారి విమర్శల పాలవుతున్నాడు. టీ20 ప్రపంచకప్ సూపర్-8 పోరులో ఇంగ్లండ్ జట్టుతో జరిగిన అత్యంత కీలకమైన మ్యాచ్‌లో బాబర్ ఆజం జిడ్డు బ్యాటింగ్‌తో జట్టును ముంచేశాడు. జట్టుకు వేగంగా పరుగులు కావాల్సిన సమయంసో బాబర్ ఆజం కేవలం 24 బంతుల్లో 25 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరాడు. ఇంగ్లండ్ బౌలర్ జేమీ ఓవర్టన్ వేసిన అద్భుతమైన బంతికి బాబర్ ఆజం క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఓపెనర్ సైమ్ అయూబ్ త్వరగా ఔట్ కావడంతో బాబర్ ఆజంపై భారీ బాధ్యత పడింది. కానీ క్రీజులో సెటిల్ అయినప్పటికీ బాబర్ ఆజం స్కోరు బోర్డును పరిగెత్తించలేకపోయాడు. కేవలం 104 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన బాబర్, ఇన్నింగ్స్ వేగాన్ని పెంచే క్రమంలో వికెట్ పారేసుకున్నారు. ఆధునిక టీ20 క్రికెట్‌లో 140-150 స్ట్రైక్ రేట్ కనీస అవసరంగా మారిన తరుణంలో, బాబర్ ఇలా టెస్ట్ తరహాలో ఆడటం పాక్ అభిమానులను ఆగ్రహానికి గురిచేస్తోంది. ఈ ఇన్నింగ్స్‌తో బాబర్ ఆజం టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే ఒక అత్యంత చెత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. టీ20 ప్రపంచకప్‌లో 500 కంటే ఎక్కువ పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో బాబర్ ఆజం ఇప్పుడు అత్యల్ప స్ట్రైక్ రేట్ కలిగిన ఆటగాడిగా నిలిచాడు. ఈ క్రమంలో ఆయన తన స్వదేశీ ప్లేయర్ మహమ్మద్ హాఫీజ్, శ్రీలంక దిగ్గజం కుమార్ సంగక్కరలను వెనక్కి నెట్టి ఈ అవమానకర జాబితాలో అగ్రస్థానానికి చేరుకున్నారు. బాబర్ ఆజం కెరీర్ మొత్తం మీద టీ20 వరల్డ్ కప్‌లో అతని స్ట్రైక్ రేట్ 111 వద్దే ఉంది. కీలకమైన నాకౌట్ లేదా సూపర్-8 మ్యాచ్‌ల్లో ఇంత నెమ్మదిగా ఆడటం జట్టుకు లాభం కంటే నష్టమే ఎక్కువ చేస్తోంది. బాబర్‌కు వరుస అవకాశాలు ఇవ్వడం ద్వారా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తమ గొయ్యి తామే తవ్వుకుంటోందని క్రీడా విశ్లేషకులు మండిపడుతున్నారు.



# మంధాన, హర్మన్ ఆదుకున్నా..

**ఆస్ట్రేలియాపై భారత్ ఓటమి**

**మూడు వన్డేల సిరీస్‌లో 0-1**

ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌ను భారత మహిళల జట్టు ఓటమితో ఆరంభించింది. ఈ సిరీస్‌లో భాగంగా మంగళవారం బ్రిస్బేన్ వేదికగా జరిగిన తొలి వన్డేలో 6 వికెట్ల తేడాతో భారత్ పరాజయం పాలైంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన హర్మన్ సేన 48.3 ఓవర్లలో 214 పరుగులకే ఆలౌటైంది. బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆదిలోనే గట్టి ఎదురు దెబ్బలు తగిలాయి. స్టార్ బ్యాటర్లు ప్రతిక రావల్ (0), షెఫాలీ వర్మ(4) వరుస బంతుల్లో పెవిలియన్‌కు చేరారు. అయితే స్మృతి మంధాన (58), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (53) బాధ్యతాయుతమైన హాఫ్ సెంచరీలతో జట్టును ఆదుకున్నారు. ఆ తర్వాత భారత్ మళ్లీ వరుస క్రమంలో వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆఖర్లో కశ్వీ గౌతమ్ (43) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో భారత్ 200 పరుగుల మార్కును దాటగలిగింది. ఆస్ట్రేలియా బౌలర్లలో యాష్ గార్డనర్ 3 వికెట్లతో రాణించగా.. మేఘాన్ షాట్, అలానా కింగ్, మెక్‌గ్రాత్ తలా వికెట్ సాధించారు. 215 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా.. 38.2 ఓవర్లలో కేవలం 4 వికెట్లు మాత్రమే కోల్పోయి చేధించింది. ఓపెనర్లు అలిస్సా హీలీ (50), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (32) అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చారు. అనంతరం బెత్ మూనీ (76 నాటౌట్) అద్భుతమైన బ్యాటింగ్‌తో జట్టును గెలుపు తీరాలకు చేర్చింది. భారత బౌలర్లలో శ్రీ చరణి రెండు వికెట్లు, దీప్తీ శర్మ, క్రాంతి గౌడ్ తలా వికెట్ సాధించారు.

# తొలి మ్యాచ్‌లో పాక్‌తో భారత్ ఢీ!

## మహిళల టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్ రిలీజ్



క్రికెట్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐసీసీ మహిళా టీ20 ప్రపంచకప్ 2026 షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) విడుదల చేసింది. ఈ ప్రతిష్టాత్మక టోర్నీకి క్రికెట్ మక్కాగా పిలవబడే ఇంగ్లండ్ ఆతిథ్యం ఇస్తోంది. 2026, జూన్ 12న ప్రారంభం కానున్న ఈ మెగా ఈవెంట్‌లో మొత్తం 12 అగ్రశ్రేణి జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. జూన్ 14న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగే హై-వోల్టేజ్ పోరుతో టీమిండియా తన ప్రపంచకప్ ప్రయాణాన్ని ఘనంగా ప్రారంభించనుంది. ఈ టోర్నీలో పాల్గొనే 12 జట్లను ఐసీసీ రెండు గ్రూపులుగా విభజించింది. గ్రూప్ దశలో ప్రతి జట్టు ఐదు మ్యాచ్‌లు ఆడుతుంది. రెండు గ్రూపుల నుండి అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. టోర్నీ నాకౌట్ దశ జూన్ 30 నుంచి ప్రారంభమవుతుంది. మొదటి సెమీఫైనల్ జూన్ 30న, రెండో సెమీఫైనల్ జులై 2న ప్రఖ్యాత 'ది ఓవల్' మైదానంలో నిర్వహిస్తారు. ఇక ప్రపంచ విజేత ఎవరో తేల్చే గ్రాండ్ ఫైనల్ మ్యాచ్ జూలై 5న చారిత్రాత్మక లార్డ్స్ మైదానంలో జరుగుతుంది. టోర్నీ ప్రారంభ మ్యాచ్ జూన్ 12న ఇంగ్లండ్, శ్రీలంక మధ్య ఎడ్జ్‌బాస్టన్ వేదికగా రాత్రి 11:00 గంటలకు జరగనుంది. ఈ మెగా టోర్నీలో భారత మహిళల జట్టు తొలిసారి ప్రపంచకప్ సాధించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

గ్రూప్-ఏ: ఆస్ట్రేలియా, భారత్, పాకిస్థాన్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్.

గ్రూప్-బీ: ఇంగ్లండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్, శ్రీలంక, ఐర్లాండ్, స్కాట్లాండ్.

**టీమిండియా మ్యాచ్‌లు:**

**జూన్ 14 -భారత్ వర్సెస్ పాకిస్థాన్-ఎడ్జ్‌బాస్టన్ వేదికగా సాయంత్రం 7:00 గంటలకు..**

**జూన్ 17-భారత్ వర్సెస్ నెదర్లాండ్స్ -హెడింగ్లీ వేదికగా సాయంత్రం 7:00 గంటలకు..**

**జూన్ 21-భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా-ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా సాయంత్రం 7:00 గంటలకు**

**జూన్ 25-భారత్ వర్సెస్ బంగ్లాదేశ్-ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా సాయంత్రం 7:00 గంటలకు..**

**జూన్ 28-భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా- లార్డ్స్ వేదికగా సాయంత్రం 7:00 గంటలకు**

# లక్నో కొత్త లోగో.. గరుడ, కిరీటం, ఏనుగు

ఐపీఎల్‌లో ప్రతిసారి గట్టి పోటీనిచ్చే లక్నో సూపర్ జెయింట్స్ వచ్చే సీజన్‌కు పక్కాగా సిద్ధమవుతోంది. ఇప్పటికే కోచింగ్ యూనిట్‌ను పటిష్టం చేసుకున్న లక్నో.. ఇకపై కొత్త లోగోతో మైదానంలోకి దిగనుంది. లావెండర్ రంగులో లక్నో పట్టణం చరిత్రను ప్రతిబింబించేలా గరుగ్మంతుడు, కిరీటం, ఏనుగు బొమ్మతో రూపొందించిన లోగో ప్రత్యేక ఆకర్షణగా మారింది. లక్నో ఫ్రాంచైజీ కొత్త లోగో ఉత్తరప్రదేశ్.. లక్నో పట్టణ విశిష్టతను, స్ఫూర్తిగాథను చాటేలా సరికొత్తగా.. అభిమానులకు అమితంగా నచ్చేలా రూపొందించారు. తాజా లోగోలో శక్తివంతమైన గరుడు, కిరీటం, ఏనుగు బొమ్మలు ఉన్నాయి. గరుడ (గరుత్మంతుడు) చిహ్నం ధైర్యానికి ప్రతీక. సవాళ్లను స్వీకరించడం.. వెనక్కి తిరిగి చూడకపోవడం, ఉన్నత శిఖరాలకు చేరడాన్ని సూచిస్తుంది. లక్నో జట్టు అనుసరించే భయమన్నది ఎరుగని క్రికెట్‌ను, సమిష్టిగా ఆడితే అసాధ్యమైన లక్ష్యమంటూ ఉండదని చాటుతుంది. కిరీటం విషయానికొస్తే దర్పం, బాధ్యతకు ప్రతీక. మైదానంలోకి దిగిన ప్రతిసారి లక్షలాదిమంది ఆశల్ని లక్నో జట్టు మోస్తుంది. లక్నో జెర్సీ ధరించడం ఎంతో గర్వకారణం. ప్రతిరోజు ఈ గౌరవాన్ని పొందాలని కిరీటం సూచిస్తుంది. కొత్త లోగుకు ఏనుగు బొమ్మ గుండెతో సమానం. బలం, తెలివి, ఓపిక, ఐక్యత.. ఈ లక్షణాలకు ప్రతిరూపమే ఏనుగు. ఫలితంతో సంబంధం లేకుండా సీజన్ సీజన్‌కు అభిమానుల నుంచి లభిస్తున్న నిరంతర మద్దతు, వారు చూపించే కృతజ్ఞతా భావానికి బొమ్మ ప్రతీక. క్లుప్తంగా చెప్పాలంటే లక్నో వీధులకు సబంధించిన లోగో ఇది. ఇంట్లో ఉండి క్రికెట్ మ్యాచ్‌లు చూసే కుటుంబాలు, ఏదో ఒకరోజు లక్నో జెర్సీ వేసుకోవాలని ఆశపడే యువతకు ఇది ప్రతిబింబం. కొత్త లోగో.. ఈ ప్రాంత చరిత్ర, గౌరవం, ఐకత్య సందేశాన్ని చాటుతుంది. ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ ఛైర్మన్, లక్నో ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గొయెంకా తమ కొత్త లోగోపై ఏమన్నారంటే.. 'ఈ కొత్త లోగో మా ఫ్రాంచైజీ భావోద్వేగానికి సంబంధించినది. మొదటి రోజు నుంచి ఉత్తరప్రదేశ్, లక్నో ప్రజలు లక్నో సూపర్ జెయింట్స్‌కు తమ హృదయాల్లో స్థానమిచ్చారు. అభిమానుల నమ్మకం, ప్రేమకు కృతజ్ఞతగా ఈ సింబల్‌ను రూపొందించాం. ఉన్నత స్థానానికి చేరాలనే మా కలకు గరుడ ప్రతీక. మైదానంలోకి దిగిన ప్రతిసారి గర్వపడే ప్రదర్శన చేయాలని కిరీటం సూచిస్తుంది. లక్నో ప్రాంత వైవిధ్యం, ధ్రుఢత్వానికి ఏనుగు సంకేతం. ఈ లోగోను మార్పుకోసమే తీసుకురాలేదు. ఇదొక ప్రామిస్. లక్నో సిటీని, ఇక్కడి మూలాలను మేము ఎంతగా గౌరవిస్తామో ఈ లోగో చెప్పకనే చెబుతుంది. ప్రతి పరుగు, వికెట్, మైదానంలోని ప్రతి క్షణం.. అభిమానుల ఎమోషన్స్‌ను చూపిస్తాయి. ఈ కొత్త లోగో ఇకపై లక్నో జట్టు జెర్సీపై, కిట్లపై, డిజిటల్ ఫ్లాట్‌ఫామ్స్‌లోనూ కనిపించనుంది. మా ఫ్రాంచైజీ అధికారిక ప్రచార సంస్థలు.. కొత్త లోగోతో కొనసాగుతాయి' అని సంజీవ్ వెల్లడించారు.

# టోర్నీ మధ్యలోనే ఇంటికి రింకూ సింగ్

టీ20 ప్రపంచకప్ 2026లో ఇప్పటికే పరాజయంతో సతమతమవుతున్న టీమిండియాకు కోలుకోలేని దెబ్బ తగిలింది. జట్టులో కీలక ఆటగాడైన లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ రింకూ సింగ్.. ఫ్యామిలీ ఎమర్జెన్సీ కారణంగా అర్ధాంతరంగా భారత శిబిరాన్ని వీడి స్వదేశానికి బయలుదేరారు. జింబాబ్వేతో జరగనున్న కీలకమైన సూపర్-8 మ్యాచ్‌కు ముందు రింకూ దూరం కావడం జట్టును ఆందోళనకు గురిచేస్తోంది. రింకూ సింగ్ తండ్రి ఖాన్ చంద్ సింగ్ ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు సమాచారం. ఆయన ప్రస్తుతం గ్రేటర్ నోయిడాలోని ఓ స్థానిక ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలియగానే రింకూ సింగ్ తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. సోమవారం జట్టుతో కలిసి చెన్నై చేరుకున్న రింకూ.. మంగళవారం ఉదయాన్నే తన తండ్రిని చూసేందుకు చెన్నై నుంచి ఇంటికి బయలుదేరి వెళ్లాడు. మంగళవారం సాయంత్రం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో కూడా ఆయన పాల్గొనలేదు. ఫిబ్రవరి 26న అహ్మదాబాద్ వేదికగా జింబాబ్వేతో జరగనున్న మ్యాచ్‌లో రింకూ సింగ్ ఆడే అవకాశం దాదాపు లేనట్లే. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన మళ్లీ జట్టుతో ఎప్పుడు కలుస్తారనే దానిపై స్పష్టత లేదు. దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి సూపర్-8 మ్యాచ్‌లో భారత్ 76 పరుగుల తేడాతో ఓడిపోయి కష్టాల్లో ఉంది. ఇప్పుడు జింబాబ్వే వంటి ప్రమాదకరమైన జట్టుతో తలపడాల్సి ఉన్న సమయంలో రింకూ దూరం కావడం పెద్ద లోటుగా పరిగణించవచ్చు. రింకూ సింగ్ అందుబాటులో లేకపోతే, తుది జట్టులో ఆ స్థానాన్ని అక్షర్ పటేల్‌తో భర్తీ చేసే అవకాశం ఉంది. దక్షిణాఫ్రికా మ్యాచ్‌లో అక్షర్ పటేల్‌ను పక్కన పెట్టడంపై ఇప్పటికే మేనేజ్‌మెంట్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇప్పుడు రింకూ స్థానంలో అక్షర్ రావడం వల్ల జట్టు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలకు బలం చేకూరనుంది.

# మేమూ ప్లాన్‌తోనే ఉన్నాం

## జింబాబ్వే కోచ్ సామన్ వెల్లడి

టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా సూపర్-8 పోరు క్లైమాక్స్‌కు చేరుతోంది. గురువారం భారత్, జింబాబ్వే జట్ల మధ్య జరగనున్న మ్యాచ్ ఇప్పుడు ఇరు జట్లకు చావోరేవోగా మారింది. ఈ నేపథ్యంలో జింబాబ్వే ప్రధాన కోచ్ జస్టిన్ సామన్ టీమిండియాను ఉద్దేశించి సంచలన కామెంట్స్ చేశారు. భారత్ తమపై ఎంత దూకుడుగా ఆడుతుందో తమకు తెలుసని.. అయితే తాము కూడా పక్కా ప్రణాళికతో బరిలోకి దిగుతున్నామని ఆయన హెచ్చరించారు. సోమవారం రాత్రి వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే 107 పరుగుల భారీ తేడాతో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. మరోవైపు భారత్ కూడా తన మొదటి సూపర్-8 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో 76 పరుగుల తేడాతో ఓడిపోయింది. దీంతో రెండు జట్లు ఇప్పుడు గెలుపు కోసం ఆకలితో ఉన్నాయి. "వెస్టిండీస్ పాటించిన దూకుడు వ్యూహాన్నే భారత్ కూడా అనుసరిస్తుందని మాకు తెలుసు. టీమిండియా మాపై ఆధిపత్యం చలాయించడానికి ఏ చిన్న అవకాశాన్ని వదలదు" అని జింబాబ్వే కోచ్ జస్టిన్ సామన్ పేర్కొన్నారు. వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో చేసిన తప్పుల నుంచి తాము పాఠాలు నేర్చుకున్నామని సామన్ తెలిపారు. "ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి, మైదానంలో ప్రశాంతంగా ఉంటూ తక్షణ నిర్ణయాలు ఎలా తీసుకోవాలి అనే విషయాలపై మేము దృష్టి సారించాం. భారత బ్యాటర్ల ఫామ్‌ను దెబ్బతీయడమే మా లక్ష్యం.

ఈవార్తలు
ప్రజావాణి
బుధవారం 25-2-2026

# క్రికెట్ శిఖరం.. బ్రాడ్‌మాన్




క్రికెట్ ప్రపంచంలో 99.94 అనేది కేవలం ఒక సగటు కాదు, అది ఒక అజేయమైన శిఖరం. క్రికెట్ బ్యాట్ పట్టిన ప్రతి ఒక్కరికీ సర్ డొనాల్డ్ జార్జ్ బ్రాడ్‌మాన్ ఒక ధ్రువతార. ఫిబ్రవరి 25న ఆయన వర్ధంతి సందర్భంగా, నేటి గ్లామర్, టెక్నాలజీ మరియు భారీ ధనప్రవాహం ఉన్న ఆధునిక క్రికెట్‌ను, బ్రాడ్‌మాన్ నాటి స్వచ్ఛమైన క్రీడా నైపుణ్యంతో పోల్చి చూసుకోవడం ఎంతైనా అవసరం. నేడు ఒక యువ క్రీడాకారుడు క్రికెట్‌ను వృత్తిగా ఎంచుకుంటే, అతనికి అత్యాధునిక అకాడమీలు, స్పెషలిస్ట్ కోచ్‌లు, డైటీషియన్లు అందుబాటులో ఉన్నారు. కానీ, బ్రాడ్‌మాన్ తన నైపుణ్యాన్ని ఎలా మెరుగుపరుచుకున్నారో మనకు తెలుసు. ఒక చిన్న స్టంప్ పట్టుకుని, గోడకు కొట్టిన గోల్ఫ్ బంతిని మళ్ళీ మళ్ళీ బాదుతూ గంటల కొద్దీ ఏకాగ్రతను సాధించిన మహానుభావుడాయన. నేటి 'పవర్ హిట్టింగ్' యుగంలో, బంతిని బలంగా కొట్టడంపై ఉన్న దృష్టి, బంతిని అర్థం చేసుకోవడంపై తగ్గడం కనిపిస్తోంది. టెక్నాలజీ ఇచ్చే 'వీడియో ఎనాలసిస్' కంటే, బ్రాడ్‌మాన్ చూపిన స్వీయ విశ్లేషణ నేటి తరం బ్యాటర్లకు అత్యంత ఆవశ్యకం. ప్రస్తుతం స్నూకర్ టేబుల్స్ లాంటి పిచ్‌లు, భారీ బ్యాట్లు, డేటా అనలిటిక్స్ క్రికెట్‌ను శాసిస్తున్నాయి. బౌలర్ ఎక్కడ బంతి వేస్తాడో ముందే కంప్యూటర్లు చెప్పేస్తున్నాయి. అయితే, బ్రాడ్‌మాన్ ఆడిన కాలంలో రక్షణ కవచాలు (హెల్మెట్/గార్డు) లేవు, పిచ్‌లు ప్రమాదకరంగా ఉండేవి. అయినప్పటికీ ఆయన సాధించిన పరుగుల ప్రవాహం అసాధారణం. నేటి క్రీడాకారులు టెక్నాలజీపై ఆధారపడుతూ, తమ సహజ సిద్ధమైన శైలిని కోల్పోతున్నారనే విమర్శ ఉంది. డేటా ఎంత ఉన్నా, మైదానంలో ఎదురయ్యే క్లిష్ట పరిస్థితుల్లో నిర్ణయం తీసుకోవాల్సింది క్రీడాకారుడి మెదడే అని బ్రాడ్‌మాన్ జీవితం నిరూపించింది. ఆధునిక క్రికెట్‌లో ఐపీఎల్ వంటి లీగ్‌ల వల్ల క్రీడాకారుల సంపాదన పెరిగింది, కానీ క్రీడా స్ఫూర్తి విషయంలో తరచూ వివాదాలు తలెత్తుతున్నాయి. స్లెడ్జింగ్, వ్యక్తిగత దూషణలు, కేవలం రికార్డుల కోసమే ఆడే ధోరణి పెరుగుతోంది. బ్రాడ్‌మాన్ తన చివరి ఇన్నింగ్స్‌లో కేవలం 4 పరుగులు చేసి ఉంటే ఆయన సగటు 100 అయ్యేది. కానీ ఆయన సున్నాకే అవుట్ అయ్యారు. ఆ విధి నిర్ణయాన్ని ఆయన చిరునవ్వుతో స్వీకరించారు. రికార్డులు కనుమరుగవుతాయి, కానీ మైదానంలో చూపిన హుందాతనం చరిత్రలో నిలిచిపోతుంది. నేటి తరం క్రీడాకారులు బ్రాడ్‌మాన్ నుండి నేర్చుకోవాల్సింది కేవలం బ్యాటింగ్ టెక్నిక్ మాత్రమే కాదు, అంకితభావం, నిరాడంబరత. ఎంత ఎత్తుకు ఎదిగినా ఆట పట్ల ప్రాథమిక గౌరవాన్ని కలిగి ఉండటమే నిజమైన సక్సెస్. టెక్నాలజీ అనేది ఒక సాధనం మాత్రమే, అది ఆటగాడిలోని పట్టుదలకు ప్రత్యామ్నాయం కాకూడదు. బ్రాడ్‌మాన్ శకం ముగిసినా, ఆయన వదిలి వెళ్ళిన క్రమశిక్షణ మార్గం ప్రతి క్రికెటర్ అనుసరించాల్సిన రాజమార్గం.

– ఈవార్తలు సంపాదకీయ విభాగం



# డిజిటల్ అరెస్ట్ ఒక మాయ

నేటి సమాజంలో సాంకేతికత ఎంతగా విస్తరిస్తోందో, దాన్ని అడ్డుపెట్టుకుని జరిగే మోసాలు అంతకంటే వేగంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న కొత్త రకం సైబర్ నేరం 'డిజిటల్ అరెస్ట్'. కానీ నిజం ఏమిటంటే.. భారతీయ చట్టాల్లో 'డిజిటల్ అరెస్ట్' అనే పదమే లేదు. ఇది కేవలం ప్రజలను మానసిక భయానికి గురిచేసి, వారి బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేసేందుకు నేరగాళ్లు వేసిన ఒక పక్కా వ్యూహం. సాధారణంగా మీకు ఒక అపరిచిత నంబర్ నుండి వీడియో కాల్ వస్తుంది. అవతలి వ్యక్తి తనను తాను పోలీసు అధికారిగానో, సీబీఐ, ఈడీ లేదా కస్టమ్స్ అధికారిగానో పరిచయం చేసుకుంటారు.

వారు ధరించే యూనిఫాం, వెనుక ఉండే పోలీస్ స్టేషన్ సెట్టింగ్ చూసి ఎవరైనా అది నిజమని నమ్ముతారు. 'మీ ఆధార్ నంబర్ డ్రగ్స్ కేసులో వాడారు' లేదా 'మీ పేరు మీద అక్రమ పార్శిల్ వచ్చింది' అని బెదిరిస్తారు. మీరు ఫోన్ కట్ చేస్తే అరెస్ట్ చేస్తామని, గంటల తరబడి స్క్రీన్ ముందే ఉండాలని ఆదేశిస్తారు. ఈ భయాన్నే వారు ఆసరాగా చేసుకుని, కేసు నుంచి బయటపడాలంటే డబ్బు పంపాలని డిమాండ్ చేస్తారు. ఏ ప్రభుత్వ సంస్థ లేదా దర్యాప్తు సంస్థ కూడా వాట్సాప్ లేదా స్కైప్ వీడియో కాల్స్ ద్వారా ఒక వ్యక్తిని అరెస్ట్ చేయదు. పోలీసులు గానీ, ఇతర అధికారులు గానీ ఫోన్ ద్వారా డబ్బులు పంపాలని ఎప్పుడూ అడగరు. ఇలాంటి కాల్స్ వచ్చినప్పుడు వెంటనే భయపడి పోకుండా, అది నకిలీ అని గుర్తించి కాల్ కట్ చేయాలి. మీకు వచ్చిన కాల్ నిజమైనదో కాదో తెలుసుకోవడానికి స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించండి. మీ బ్యాంక్ వివరాలు, ఓటీపీ లేదా ఆధార్ నంబర్లను ఎవరికీ చెప్పకండి. మీరు పొరపాటున మోసపోయినా లేదా అనుమానాస్పద కాల్స్ వచ్చినా వెంటనే 1930 నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్‌కు ఫోన్ చేయండి లేదా సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేయండి. డిజిటల్ అరెస్ట్ అనేది ఒక అపోహ మాత్రమే. దీనిపై ప్రజల్లో అవగాహన పెరిగినప్పుడే సైబర్ నేరగాళ్ల ఆట కట్టించవచ్చు. భయం వద్దు.. జాగ్రత్తే మనకు రక్ష!



రణధీర్ గుండు

పశ్చిమాసియా రాజకీయ చిత్రపటం మరోసారి యుద్ధ మేఘాలతో నిండిపోయింది. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ పట్ల అవలంబిస్తున్న శైలి హద్దులు దాటింది. ఆంక్షలకే పరిమితం కాకుండా, ఒక నిర్ణయాత్మకమైన దౌత్య యుద్ధంగానూ, సైనిక ఘర్షణ అంచుగానూ కనిపిస్తోంది. ట్రంప్ తన విలక్షణ శైలిలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీకి నేరుగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

# ట్రంప్.. పెద్ద కంపు!



యుద్ధనౌకలు ఇరాన్ వైపు కదులుతోందని వ్యాఖ్యానించడం ద్వారా భౌతిక దాడికి తాము వెనుకాడబోమని సంకేతాలిచ్చి తన యుద్ధ కాంక్షను వెలిబుచ్చుతున్నారు. ముఖ్యంగా ఇరాన్ తన అణు కార్యకలాపాలను నియంత్రించుకోకపోతే 'పరిమిత దాడులు' చేసే ఆలోచనలో ఉన్నట్లు ఆయన చేసిన ప్రకటన అంతర్జాతీయ సమాజంలో కలకలం రేపింది. కేవలం ఇరాన్‌ను నియంత్రించడమే కాకుండా, ఆ దేశంతో వాణిజ్యం చేసే ఇతర దేశాలపై కూడా ట్రంప్ కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇరాన్‌తో వ్యాపారం చేసే ఏ దేశమైనా అమెరికాకు 25 శాతం సుంకం చెల్లించాల్సిందేనన్న నిబంధన భారత్, చైనా వంటి దేశాలకు సవాలుగా మారింది. ఇది ఇరాన్‌ను ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నుండి పూర్తిగా ఏకాకిని చేసే వ్యూహం. ఇరాన్‌లో నెలకొన్న అంతర్గత ఆర్థిక సంక్షోభం, నిరసనలను ట్రంప్ తనకు అనుకూలంగా మలచుకుంటున్నారు. ఇరాన్‌లో పాలన మార్పు జరగడం ప్రపంచ భద్రతకు అత్యుత్తమ పరిణామం అవుతుందని ఆయన చేసిన వ్యాఖ్యలు అగ్రరాజ్యం అసలు ఉద్దేశాలను స్పష్టం చేస్తున్నాయి. నిరసనకారులపై హింసను ప్రేరేపిస్తే ఇరాన్‌ను భూమిపై లేకుండా చేస్తామన్న ఆయన హెచ్చరికలు అత్యంత వివాదాస్పదమయ్యాయి. ఒకవైపు యుద్ధనౌకలను మోహరిస్తూనే, మరోవైపు ఇరాన్ ఒప్పందానికి రావాలి అని ట్రంప్ పదే పదే హెచ్చరిస్తున్నారు. 10 నుండి 15 రోజుల గడువు విధించి, అణు రహిత ఒప్పందం కోసం చర్చలకు పిలుపునివ్వడం ద్వారా దౌత్యానికి చిన్న కిటికీని తెరిచి ఉంచారు. అయితే, 'లొంగిపోయే ప్రసక్తే లేదు' అన్న ఇరాన్ వైఖరి పరిస్థితులను మరింత క్లిష్టతరం చేస్తోంది. ట్రంప్ అనుసరిస్తున్న ఈ అనూహ్య శైలి పశ్చిమాసియాను శాంతి వైపు నడిపిస్తుందా లేక మరో భారీ యుద్ధానికి దారితీస్తుందా అన్నది ప్రస్తుతం ఉత్కంఠగా మారింది. ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతున్న వేళ, ట్రంప్ తన వ్యూహంతో టెహ్రాన్‌ను చర్చలకు రప్పించగలిగితే అది దౌత్య విజయమే అవుతుంది. లేనిపక్షంలో, అగ్రరాజ్యం చేసే చిన్న పొరపాటైనా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, చమురు ధరలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదముంది.

- విశ్వతేజ మల్లారపు, హైదరాబాద్

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.